

తాగునీరెట్లా?

పొంచి ఉన్న తాగునీటి ఎద్దడి

- తరకటూరు సమ్మర్ స్టోరేజీ ట్యాంకులో 2.19 మీటర్లకు చేరిన నీటిమట్టం
- కృత్తివెన్నులో అడుగంటిన మంచినీటి చెరువు
- జిల్లాలోని 266 తాగునీటి చెరువుల్లో పూర్తి స్థాయిలో పడిపోయిన నీటి వనరులు
- మచిలీపట్నం కార్పొరేషన్‌తోపాటు అన్ని మండలాల్లో ఎద్దడి తీవ్రం



తరకటూరు సమ్మర్ స్టోరేజీ ట్యాంకులో తగ్గిన నీటిమట్టం



నీరు లేక ఎండిపోయిన కృత్తివెన్ను తాగునీటి చెరువు

తాగునీటి కోసం జిల్లా పరితపిస్తోంది. గుక్కెడు నీరు దొరక్క దాహంతో అంగలారుస్తోంది. 2.4 లక్షల మందికి తాగునీరు అందించే తరకటూరు సమ్మర్ స్టోరేజీ ట్యాంకు దాదాపు డెడ్ స్టోరేజీకి చేరింది. తాగునీటి పథకాలన్నీ దాదాపు పడకేశాయి. జిల్లాలో ఉన్న 266 తాగునీటి చెరువుల్లో నీరు అడుగంటింది. ప్రజలకు బబుల్ నీళ్లే దిక్కయ్యాయి. వేసవి అనంతరం తాగునీటి అవసరాల కోసం పంటకాలువలకు నీటిని విడుదల చేసే పరిస్థితి ఇప్పట్లో లేకపోవడంతో రానున్న రోజుల్లో అన్ని ప్రాంతాల్లో ఎద్దడి పొంచి ఉంది. ఇప్పటికే మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్, పెడన పురపాలకసంఘం, మచిలీపట్నం మండలానికి రోజువిడిచి రోజు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. తాగునీటిని పొదుపుగా వాడుకోవాలని అధికారులు హెచ్చరికలు జారీ చేయడం సమస్య తీవ్రతకు అద్దం పడుతోంది.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : తాగునీటి అవసరాల కోసం ఈ ఏడాది ఏప్రిల్ మొదటి వారంలో జిల్లాలోని 266 తాగునీటి చెరువులను నింపారు. ఆ తరువాత ఏప్రిల్, మే, జూన్ నెలల్లో దాదాపుగా అడుగంటాయి. జూన్‌లో కాలువలకు నీటిని విడుదల చేయలేదు. ఎప్పటికి విడుదల చేస్తారో ఇప్పటికీ స్పష్టత లేదు. దీంతో ఈ నెలలోనూ జిల్లా ప్రజలకు తాగునీటి ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన దుస్థితి నెలకొంది.

దాదాపు డెడ్ స్టోరేజీకి తరకటూరు సమ్మర్ స్టోరేజీ ట్యాంకు

మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్‌లోని 2.40 లక్షల మంది, మచిలీపట్నం మండలంలోని 34 పంచాయతీల్లోని 105 ఆవాసాల్లోని 75 వేల మందికిపైగా జనాభాకు, పెడన మున్సిపాలిటీలో 35 వేల మందికి, గూడూరు మండలంలోని 15 గ్రామాల్లోని 25 వేల మందికి, మొత్తంగా 3.75 లక్షల మందికి తాగునీటి అవసరాల కోసం తరకటూరు సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నుంచి వచ్చే తాగునీరే ప్రధాన ఆధారం. 180 ఎకరాల్లోని తరకటూరు సమ్మర్‌స్టోరేజీ ట్యాంకు పూర్తిస్థాయి సామర్థ్యం 5.5 మీటర్లు. ప్రస్తుతం ఈ చెరువు నీటిమట్టం 2.19 మీటర్లకు చేరింది. 1.5 మీటర్లకు నీటిమట్టం చేరితే ఆ నీరు మురికిగా మారి పంపింగ్ చేయడానికి అవకాశం ఉండదు. పంపింగ్ చేసినా ఫిల్టర్ కాదు. ఏడాదిలో వర్షాకాలం, వేసవి కాలాలతో సంబంధం లేకుండా మచిలీపట్నం పరిసరప్రాంతాలకు రోజువిడిచి రోజు తాగునీటిని సరఫరా చేస్తున్నారు.

నీటి అవసరాలివీ..

మచిలీపట్నం కార్పొరేషన్ పరిధిలో రోజుకు 22 మిలియన్ లీటర్ల నీటిని వినియోగించాల్సి ఉంది. పెడన పురపాలక సంఘానికి 12 మిలియన్ లీటర్లు, మచిలీపట్నం మండలంలోని ఆర్‌డబ్ల్యూఎస్ పథకాలకు 8 మిలియన్ లీటర్లు తాగునీటి అవసరాలకోసం వినియోగించాల్సి ఉంది. తరకటూరు సమ్మర్‌స్టోరేజీ ట్యాంకులోని నీరు రోజుకు రెండు పాయింట్ల చొప్పున నీటిమట్టం తగ్గిపోతుంది. అత్యవసర స్థితిలో డెడ్‌స్టోరేజీ పాయింట్ నుంచి నీటిని పంపింగ్ చేసినా, నీరు తాగేందుకు పనికిరాదు.

266 తాగునీటి చెరువుల స్థితి ఇదీ..

జిల్లాలో 266 తాగునీటి చెరువులు ఉన్నాయి. గత వేసవిలో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి అవసరాలు పెరగడంతో తాగునీటి చెరువుల్లోని నీటిమట్టం దాదాపు తగ్గింది.

- కృత్తివెన్ను గ్రామంలోని తాగునీటి చెరువులో నీరు అడుగంటి చెరువు అడుగు భాగంలోని నేల కూడా కనిపిస్తోంది.
- మాట్లాం గ్రామంలోని తాగునీటి చెరువు ఎండిపోవడంతో ఈ గ్రామస్థుల తాగునీటి కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయి. రాత్రి, పగలు తేడా లేకుండా దూరప్రాంతాల్లోని సంప్‌ల వద్ద తాగునీటిని ప్లాస్టిక్ డాబ్బాలలో నింపుకునేందుకు ప్రజలు పడిగాపులు పడి నీటిని పట్టుకుంటున్నారు.
- కృత్తివెన్ను మండలంలోని గ్రామాలకు తాగునీటిని సరఫరా చేసే సీతనపల్లి మెగా రక్షిత పథకం చెరువును ఏప్రిల్‌లో కాలువలకు నీటిని విడుదల చేసినా పూర్తిస్థాయిలో నింపలేదు. దీంతో ఈ చెరువు నుంచి తాగునీటి విడుదల రోజురోజుకు తగ్గిపోతోంది.

ట్యాంకర్ల నీరే దిక్కు..

కృత్తివెన్ను మండలంలో పలు గ్రామాల్లో ప్రైవేటు వ్యక్తులు ట్యాంకర్ల ద్వారా విక్రయిస్తున్నారు. 200 లీటర్ల నీటిపీపాను రూ.150కు జనం కొనుగోలు చేస్తున్నారు. ఈ ఏడాది పడినన్ని తాగునీటి కష్టాలు ఎప్పుడూ పడలేదని కృత్తివెన్ను మండల ప్రజలు వాపోతున్నారు. పంచాయతీ నిధులతో నిర్వహించే రక్షిత మంచినీటి పథకాలు జిల్లాలో 245 ఉన్నా, తాగునీరు అడుగంటడంతో ఇవన్నీ పడకేశాయి. తాగునీటిని ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు పంచాయతీల్లో నిధులు అందుబాటులో లేకపోవడంతో పంచాయతీ పాలకవర్గాలు చేతులెత్తేసి మిన్న కుండిపో యాయి. సముద్రతీరంలోని పెడన, బంటు మిల్లి, కృత్తివెన్ను మండలాల్లోని 20 గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నెలకొందని, ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినా సక్రమంగా తాగునీటిని అందించడం లేదు. పెడన మండలం ఉప్పలకలవగుంట గ్రామంలోని మెగా రక్షిత మంచినీటి పథకం ద్వారా 32 గ్రామాలకు తాగునీటిని సరఫరా చేయాలి. ఈ చెరువులోని నీటిమట్టం తగ్గిపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నందమూరు, కోటవానిపాలెం, మడక, దేవరపల్లి తదితర గ్రామాలకు ఉప్పలకలవగుంట రక్షిత నీటి పథకం నుంచి తాగునీటి విడుదల నిలిపివేశారు. దీంతో ప్రైవేటు ట్యాంకర్ల వద్ద నీటిని గ్రామస్తులు కొనుగోలు చేస్తున్నారు.

ఎలుకలు కొట్టిన స్పీడ్ పోస్టు!



వ్యాపారికి వచ్చిన ఎలుకలు కొట్టిన పార్శిల్

నాగాయలంక, జూలై 3 : ఇంట్లో ఎలుకలు ఉన్నాయంటే ఎవరైనా ఏం చేస్తాం? ముఖ్యమైన వస్తువులను జాగ్రత్తపరుస్తాం. ఎలుకలు లేని ప్రాంతంలో భద్రపరుస్తాం. వీలేతే ఎలుకలనే నివారించే పద్ధతులు పాటిస్తాం. పోస్టాఫీస్‌లో విలువైన స్పీడ్‌పోస్టు కవర్లను ఎలుకలు కొడుతున్నా... మళ్లీమళ్లీ అలాగే జరుగుతున్నా అధికారుల్లో చలనం లేదు. గతనెల 26వ తేదీన నాగాయలంకకు చెందిన ఒక వ్యాపారికి వైజాగ్ నుంచి ఎలుకలు కొట్టేసిన పార్శిల్ స్పీడ్‌పోస్ట్‌లో వచ్చింది. పార్శిల్‌ను ఎలుకలు ఎలా కొట్టేశాయని సందేహిస్తూనే పోస్టుమాన్ దగ్గర తీసుకున్నాడు. వారం తర్వాత బుధవారం మళ్లీ అలాగే ఎలుకలు కొట్టిన మరో పార్శిల్‌ను అదే వ్యాపారి వద్దకు తీసుకువచ్చాడు పోస్ట్‌మ్యాన్. మళ్లీ ఎలుకలు కొట్టిన పార్శిల్‌ని తీసుకొచ్చావేంటయ్యా అని పోస్ట్‌మ్యాన్‌ను వ్యాపారి ప్రశ్నించాడు. ఈ పార్శిల్ వద్దని తిరిగి ఇచ్చాడు. 'పోస్టాఫీస్‌లో ఎలుకలు కొట్టేస్తుంటే నేనేం చేయను' అని పోస్టుమ్యాన్ సమాధానం ఇచ్చి వెళ్లిపోవడంతో ఆ వ్యాపారి విస్మయం వ్యక్తం చేశాడు. స్పీడ్‌పోస్టుల్లో వచ్చేవాటిలో విలువైన డాక్యుమెంట్స్ ఎక్కువగా ఉంటాయి. ఎప్పటికప్పుడు జనానికి చేరవేసే స్పీడ్‌పోస్టులకు రక్షణ కల్పించడంలో పోస్టాఫీస్ సిబ్బంది ఇంత నిర్లక్ష్యంగా ఉన్నారంటే ఆఫీసులో ఉండే డాక్యుమెంట్లు ఎన్ని ఎలుకలు ఆహారమయ్యాయోనని ఆశ్చర్యం వ్యక్తం చేశాడు.

స్క్రూడ్రైవర్‌తో 8 సార్లు గొంతులో పొడిచి..

- కించపరిచే విధంగా మాట్లాడాడని...
- క్షణికావేశంలో భర్తను హతమార్చిన భార్య

బంటుమిల్లి, జూలై 3 : బంటుమిల్లి మండలం చినతుమ్మిడిలో భార్య చేతిలో భర్త హత్యకు గురయ్యాడు. ఘటన మంగళవారం రాత్రి జరిగింది. భర్తను భార్య స్క్రూ డ్రైవర్‌తో 8సార్లు గొంతులో పొడవడంతో అతను అక్కడికక్కడే మరణించాడు. ఈ ఘటన బంటుమిల్లి మండలంలో సంచలనం కలిగించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చినతుమ్మిడి గ్రామానికి చెందిన గుసిమి అప్పారావు (30)కు, నెల్లూరు జిల్లా జలబంకి మండలం కొత్తపాలేనికి చెందిన కీర్తనకు తొమ్మిది సంత్సరాల క్రితం వివాహమైంది. అప్పారావుకు కీర్తన స్వయానా మేనకోడలు. చినతుమ్మిడి పరిసర గ్రామాల్లో పొలంలో పురుగుమందులు పిచికారీ చేసే స్ప్రేయర్లకు మరమ్మతులు చేస్తూ అప్పారావు కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వీరికి ఆరేళ్ల కుమారుడు ఉన్నాడు. కొంతకాలంగా కీర్తన ప్రవర్తనపై అనుమానంతో ఆమె భర్త కాపురం సక్రమంగా సాగాలంటే పద్ధతులు మార్చుకోవాలని తరచూ హెచ్చరిస్తున్నాడు. ఈ విషయంపై భార్యాభర్తలకు తరచూ గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో భార్యాభర్తల మధ్య వాగ్వివాదం జరిగింది. ఆ సమయంలో భార్యను కించపరిచే విధంగా అప్పారావు తీవ్రవ్యాఖ్యలు చేశాడు. ఇరువురి మధ్య పెనుగులాట తీవ్రస్థాయికి చేరింది. కీర్తన క్షణికావేశంలో అందుబాటులో ఉన్న స్క్రూడ్రైవర్‌తో తన భర్త గొంతులో 8 సార్లు పొడిచింది. ఈదాడిలో గాయపడిన బాధితుడు తీవ్ర గాయాలయ్యాయి. స్పృహతప్పి పడిపోయాడు. కొంతసేటికి కీర్తన తన భర్తకు తనకు మధ్య గొడవ జరిగిందని, తన భర్త పడిపోయాడని ఆసుపత్రికి తీసుకెళ్లాలని సమీపంలో ఉన్న బంధువులకు సమాచారం ఇచ్చింది. బంధువులు వచ్చేసరికి అప్పారావు కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నాడు. 108 సిబ్బంది ఘటనా స్థలానికి వచ్చి చూసి అప్పారావు మృతి చెందాడని నిర్ధారించారు. మృతుని సోదరి పి.అచ్చమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంటుమిల్లి ఎస్సై వాసు కేసు నమోదు చేశారు.

సహకార శాఖలో ఊసరవెల్లులు

- నిన్నటి వరకు వైఎస్సార్ ట్రేడ్ యూనియన్
- నేడు తెలుగునాడు ట్రేడ్ యూనియన్ జెండా

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : సహకార శాఖలో ఊసరవెల్లులు తయారయ్యాయి. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీ జెండా మార్చేసి తమ పబ్బం గడుపుకొనేందుకు సిద్ధమైపోతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఉద్యోగులు తమ హక్కుల సాధన కోసం యూనియన్లను ఏర్పాటు చేసుకున్నారు. అలాంటి వాటిలో ఏపీ కో-ఆపరేటివ్ బ్యాంక్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఒకటి. ఈ యూనియన్ నెల రోజుల క్రితం వరకు వైఎస్సార్ ట్రేడ్ యూనియన్‌కు అనుబంధంగా ఉండేది. ఎప్పుడైతే రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగిందో ఈ యూనియన్ నాయకులు సైతం తమ విధేయతను మార్చేసుకున్నారు. పసుపు కండువా కప్పుకొని తెలుగునాడు ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్‌కు తమ యూనియన్‌ను అనుబంధ సంస్థగా మార్చేశారు. ఆగమేఘాలపై టీడీపీ నాయకులను కలిసి పసుపు కండువాలు కప్పించుకున్నారు. ఈ యూనియన్ నాయకుల తీరుతో తటస్థ యూనియన్‌గా ఉద్యోగుల సమస్యలపై పోరాడిన నాయకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ అధికారంలో ఉన్నంతకాలం వారి వేధింపులకు గురయ్యామని, మళ్లీ ఇప్పుడు అదే నాయకులు తమను వేధింపులకు గురి చేసేందుకు ఊసరవెల్లుల్లా పార్టీ మార్చి అధికార పార్టీ చెంతన చేరారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఎత్తిపోతల పథకం వద్ద నీరు విడుదల చేసి పరిశీలిస్తున్న మంత్రి నిమ్మల, కలెక్టర్, ఎమ్మెల్యేలు

హమ్మయ్యా.. నీళ్లొదిలారు

ఒకేసారి పట్టిసీమ, తాడిపూడి నుంచి నీటి విడుదల

- లాంఛనంగా ఆరంభించిన జల వనరుల మంత్రి నిమ్మల రామానాయుడు
- రైతుల్లో వెల్లివిరుస్తున్న ఆనందం

(ఏలూరు - ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : గోదావరిలో ఎగువప్రాంతం నుంచి వరద నీరు వచ్చి చేరడంతో ఎత్తిపోతల నుంచి నీటి విడుదలకు అనువైన పరిస్థితులు ఏర్పడ్డాయి. దీన్ని గమనించి రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం వేగంగా కదిలింది. పోలవరం సమీపాన ఉన్న పట్టిసీమ నుంచి 8వేల క్యూసెక్కులు విడుదలే లక్ష్యంగా నీటి విడుదలకు శ్రీకారం చుట్టింది. మరో రెండు, మూడు రోజుల్లోనే కాల్వల్లో 8 వేల క్యూసెక్కుల నీటి సామర్థ్యం మేర ప్రవాహం ఉంటుందని ఇంజనీర్లు చెప్పారు. ఇప్పటికే కృష్ణా నదిలో నీరు అతి తక్కువగా ఉండడంతో గోదావరి వరద జలాలు పట్టిసీమ ద్వారా ప్రకాశం బ్యారేజీకి చేరుకోనున్నాయి.

సంబరమే సంబరం

ఒకేసారి పట్టిసీమ, తాడిపూడి ఎత్తిపోతల పథకాల నుంచి గోదావరి జలాలు విడుదల కావడంతో ఆయా ప్రాంతాల్లో రైతుల్లో హర్షామోదాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే తొలకరి ఆరంభమైనా రైతులకు సంతృప్తికరంగా సాగునీరు అందడం లేదు. పగటి ఉష్ణోగ్రతలు తగ్గకపోవడమే దీనికి ప్రధాన కారణం. ఖరీఫ్ ఈసారి అనూహ్యంగా ఆలస్యమైంది. ఈ పరిణామ క్రమంలోనే ప్రకాశం బ్యారేజీ నుంచి పట్టిసీమ నీరు కృష్ణా డెల్టాకు జీవం పోయనుండటంతో ఆ ప్రాంత రైతుల్లో ఆనందం వెల్లివెరిసింది. ఇటు తాడిపూడి ఎత్తిపోతల పథకం నుంచి ఇన్నాళ్లలో ఎప్పుడూ లేనంత పట్టిసీమ, తాడిపూడి నుంచి ఒకేసారి నీటి విడుదల సహజంగానే రైతుల్లో ఆనందాన్ని రెట్టింపు చేసింది.

> కూటమి ప్రభుత్వం రాకతో పట్టిసీమ కుడి కాల్వ పరిధిలోని రైతుల్లో మళ్లీ ఆనందం నెలకొంది. ఐదేళ్ల పాటు జగన్ హయాంలో ఈ ఎత్తిపోతల నుంచి సాగునీరు ఎప్పుడు విడుదల చేస్తారో, ఎప్పుడు ఆపేస్తారో తెలియక రైతులు కొట్టుమిట్టాడారు. పట్టిసీమ, తాడిపూడి ఎత్తిపోతల ద్వారా జలవనరుల మంత్రి రామానాయుడు బుధవారం నీటిని వదలడంతో హర్షం వ్యక్తం చేశారు.

ఇదంతా చంద్రబాబు దయే : మంత్రి నిమ్మల

'సాగునీటి ప్రాజెక్టులకు ప్రాణం పోస్తున్నారు. ఇంతకు ముందు నదుల అనుసంధానానికి శ్రీకారం చుట్టినట్లే అదే పంథాలో ప్రాధాన్యత క్రమంలో సాగునీటి పథకాలు పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఆ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు మరింత చొరవ తీసుకుంటున్నారు. ఆ క్రమంలోనే రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని పట్టిసీమ, తాడిపూడి ఎత్తిపోతల పథకాల ద్వారా నేడు గోదావరి జలాలను విడుదల చేశాం' అని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. పట్టిసీమ, తాడిపూడి నుంచి గోదావరి జలాలను విడుదల చేసిన అనంతరం గోదారమ్మకు ప్రత్యేక పూజలు చేసి పూలు, వస్త్రాలు సమర్పించారు.



రాష్ట్రానికే మోడల్‌గా మల్లవల్లి
- అన్ని సౌకర్యాలతో పారిశ్రామికవాడగా తీర్చిదిద్దుతాం : మంత్రి భరత్
- సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు

4లో..
ఆర్టీసీ హైర్‌బస్సు ఆపరేటర్ల మెరుపు సమ్మె

కదల్లేని స్థితిలోనూ.. దుర్గమ్మకు 95 ఏళ్ల
వృద్ధురాలి విరాళం

- అన్నదానం, బంగారు తాపడం పనులకు రూ.3 లక్షలు
- ఇంటికి వెళ్లి విరాళం స్వీకరించిన ఈవో



(విజయవాడ - ఆంధ్రజ్యోతి)

విజయవాడ భవానీపురానికి చెందిన వి.అనసూయమ్మ (95) వృద్ధురాలు తాను దాచుకున్న రూ.3 లక్షల పొదుపు సొమ్మును దుర్గమ్మకు కానుకగా ఇచ్చారు. మంచంపై నుంచి కదల్లేని స్థితిలో ఉన్న ఆమె చెంతకు బుధవారంనాడు దుర్గగుడి ఈవో కేఎస్ రామారావు వెళ్లి ఆ మొత్తాన్ని తీసుకుని రశీదులు అందజేశారు. తాను ఇచ్చిన మొత్తంలో రూ.1.5 లక్షలను అన్నదానానికి, మరో రూ.1.5 లక్షలు బంగారు తాపడం పనుల కోసం వినియోగించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో అనసూయమ్మ కొడుకు, ప్రముఖ న్యాయవాది వీఎస్ఆర్ ఆంజనేయులు, ఇతర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



విరాళాన్ని ఈవో రామారావుకు అందిస్తున్న వి.శ్రీనివాసరావు కుటుంబసభ్యులు

గర్భాలయ గోపుర స్వర్ణతాపడానికి రూ.5లక్షలు..

వన్‌టౌన్ : దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం గర్భాలయ గోపురం స్వర్ణతాపడానికి విజయవాడ గణేశ్‌నగర్ కాలనీకి చెందిన వై.శ్రీనివాసరావు ఆయన కుటుంబసభ్యులు యంద్రాతి దర్శన్ పేరిట రూ.5లక్షలు, అన్నవితరణ కార్యక్రమానికి రూ.1,01,116లు, ఒక రోజున 500 మందికి అన్నవితరణ చేసేందుకు రూ.21వేలు విరాళాలను అందజేశారు. బుధవారం ఆలయానికి విచ్చేసిన శ్రీనివాసరావు, ఆయన కుటుంబసభ్యులు ఈవో కేఎస్ రామారావు ద్వారా దేవస్థానానికి చెక్కు రూపంలో మొత్తాన్ని అందజేశారు. దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. దాతకు అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు.

31 నుంచి శ్రావణమాస రైలు యాత్ర

ధర్నాచౌక్, జూలై 3 : ఇండియన్ రైల్వే ప్రత్యేకంగా ఈ నెల 31 నుంచి 10 రోజుల పాటు శ్రావణమాసం అమావాస్య రైలు యాత్ర చేపడుతున్నట్టు భారత్ గౌరవ్ స్టార్ రైల్ ప్రొడక్ట్ డైరెక్టర్ విగ్నేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ యాత్రలో పాద గయ, నాభి గయ, శిరో గయ, పూరీ జగన్నాథుడు, కాశీ విశ్వనాథుడు, అన్నపూర్ణదేవీ దర్శనం, గయలో శ్రావణ అమావాస్య రోజు పిండ తర్పణం, అయోధ్యలో రాముని దర్శనం, త్రివేణి సంగమంలో పుణ్యస్నానం, పురుహూతిక దేవీ, విమలాదేవీ, బిరాజా దేవీ, మంగళగౌరి, కాశీ విశాలాక్షి, ఆలోపిదేవి శక్తి పీఠాలను సందర్శించవచ్చన్నారు. వసతి, భోజనం, బస్సుతో కలిపి ఏసీ థర్డ్‌క్లాస్ కంఫర్ట్ రూ.32,500, స్లీపర్ క్లాస్ రూ.19,500లు అన్నారు. టికెట్ల బుకింగ్ కోసం 93550 21516 ఫోన్‌నంబర్‌ను, డబ్ల్యూ డబ్ల్యూడబ్ల్యూ డాట్ ట్రైన్‌టూర్ డాట్ ఇన్‌లో సంప్రదించాలన్నారు.

వంశపారంపర్య ధ్రువీకరణ పత్రాలు జారీ చేయండి

అవనిగడ్డ, జూలై 3 : అర్చక స్వాములకు వంశపారంపర్య ధ్రువీకరణ పత్రాలు వెంటనే జారీ చేయాలని రాష్ట్ర అర్చక సమాఖ్య వ్యవస్థాపక కార్యదర్శి డా.టి.అనంతాచార్యులు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రెండేళ్ల క్రితం అర్చక స్వాముల నుంచి ఆధార పత్రాలు నోటరీ ద్వారా తీసుకోవటం జరిగిందని, అందుకు సంబంధించి హక్కు పత్రాలు జారీ చేసేందుకు సిద్ధం చేసినప్పటికీ ఇవ్వకపోవటం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ధ్రువీకరణ పత్రాలు తీసుకోవలసిందిగా అర్చకులకు సమాచారం ఇచ్చి.. వెంటనే పత్రాలు జారీని వాయిదా వేయటంలో ఆంతర్యం తెలియటం లేదని, కేవలం అర్చకులను వేధింపులకు గురి చేయటమే సస్పెన్షన్‌కు గురైన సహాయ కమిషనర్ శాంతి ధ్యేయంగా పెట్టుకున్నారని.. తక్షణమే నూతనంగా బాధ్యతలు చేపట్టే సహాయ కమిషనర్ హక్కు పత్రాలు జారీ చేయాలని కోరారు. అవినీతి ఆరోపణలతో జిల్లా దేవదాయశాఖ కమిషనర్ శాంతిని సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వటం పట్ల దివి తాలూకా అర్చక సమాఖ్య సభ్యులు హర్షం ప్రకటించారు.

దివ్యాంగుల రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

కృష్ణలంక, జూలై 3 : జాతీయ దివ్యాంగుల ఆర్థిక అభివృద్ధి సంస్థ (ఎన్‌హెచ్ఎఫ్‌డీసీ) న్యూఢిల్లీ వారు దివ్యాంగుల రుణాలకు 2024-25 సంవత్సరానికిగాను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రూ.9.15 కోట్లు కేటాయించారని ఎన్టీఆర్ జిల్లా విభిన్న ప్రతిభావంతుల, వయోవృద్ధుల సహాయ సంస్థ జిల్లా మేనేజర్ వాడ్రేవు కామరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ జిల్లాలోని ఆసక్తి గల దివ్యాంగులు 40 శాతం, ఆపైన అంగవైకల్యం కలిగి వయస్సు 18 నుంచి 60 సంవత్సరాలు కలవారు (ఎంఆర్ అయితే 14 సంవత్సరాలు) ఎన్‌హెచ్ఎఫ్‌డీసీలోనుకు అర్హులు. మంజూరైన రుణం మొత్తం తిరిగి వడ్డీతో చెల్లించాల్సి వుంటుంది. ఎటువంటి సబ్సిడీ ఉండదు. (10 వేల నుంచి 50 వేల వరకు వడ్డీ 5 శాతం, 50,001 నుంచి రూ.5 లక్షల వరకు వడ్డీ 6 శాతం)లోను దరఖాస్తు కొరకు కార్యాలయం పనివేళల్లో సంప్రదించాలని తెలిపారు. దరఖాస్తుకు సదరం సర్టిఫికెట్, యుడీఐడీ కార్డు, ఆధార్ కార్డు, విద్యా/శిక్షణ ధృవీకరణ పత్రం, బ్యాంకు పాస్ పుస్తకం కాపీ, అంగవైకల్యం కనిపించేలా 2 పాస్‌పోర్టు సైజు ఫొటోలు, లోను లక్ష రూపాయలు దాటిన యెడల ప్రాజెక్టు రిపోర్టు సంబంధిత పరిశ్రమల శాఖ వారి నుంచి తీసుకొని సమర్పించాలని తెలిపారు. ఎన్‌హెచ్ఎఫ్‌డీసీ రుణాలు చిన్న చిన్న వ్యాపారాలు చేసుకొనుటకు, ఉన్న వ్యాపారాలు అభివృద్ధి చేసుకొనేందుకు మంజూరు చేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. లక్ష రూపాయల వరకు ష్యూరిటీగా ప్రభుత్వ ఉద్యోగి (ఐదేళ్ల సర్వీసుకలిగి) వుండాలని తెలిపారు. లక్ష దాటిన వారికి ష్యూరిటీగా ప్రభుత్వ ఉద్యోగి, బ్యాంకు గ్యారంటీ లేదా ఆస్తి తాలూకు ఒరిజినల్ దస్తావేజులు ష్యూరిటీగా పెట్టవచ్చునని పై మూడింటిలో ఏదో ఒక దానిని ష్యూరిటీగా ఇవ్వాల్సి వుంటుందని తెలిపారు. రూ.లక్షకు మూడేళ్ల కాలపరిమితి, రూ.5 లక్షలకు ఐదేళ్ల కాలపరిమితిగా నిర్ణయించడమైందని తెలిపారు. జాయింట్ కలెక్టర్/ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, జిల్లా మేనేజర్ జాయింట్ అకౌంట్‌కు ఈసీఎస్ చేయాలన్నారు. లబ్దిదారుడు సంతకం చేసిన మూడు చెక్కులు ఇవ్వాలని తెలిపారు. దరఖాస్తుల పరిశీలన, ఎంపిక లోను మంజూరు కార్యక్రమాలు జేసీ అధ్యక్షతన జిల్లా స్క్రీనింగ్ కమిటీ (డీఎల్ఎస్‌సీ) ద్వారా జరుగునని పేర్కొన్నారు. జిల్లాలోని ఆసక్తి గల దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వివరాల కోసం కార్యాలయం ఫొన్ నెం.08672-252637కు సంప్రదించాలని తెలిపారు.



పొలాలు దాటి బిందెలతో నీటిని తెచ్చుకుంటున్న మహిళలు

గుక్కెడు నీటి కోసం.. గట్లు దాటాల్సిందే

- నంగేగడ్డలో తాగునీటి అవస్థలు

నాగాయలంక : గుక్కెడు నీటి కోసం పొలాల మధ్య నడిచి వెళ్లి నీళ్లు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నంగేగడ్డ గ్రామంలో నెలకొంది. మండలంలోని నంగేగడ్డ పంచాయతీ రక్షిత మంచినీటి పథకం ద్వారా కుళాయిల నీరు రంగుమారింది. వాడుకునేందుకు కూడా పనికి రాకుండా ఉండటంతో తాగునీటి కోసం సుదూరంలో ఉన్న చేతి పంపుల నుంచి నీరు తెచ్చుకుని దాహార్తిని తీర్చుకుంటున్నామని గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు. పంచాయతీ రక్షిత మంచినీటి పథకంలోని ఫిల్టర్ బెడ్లు సరిగా పని చేయటం లేదని, వాటర్ ట్యాంక్ క్లీనింగ్ సరిగా ఉండటం లేదని వారు విమర్శిస్తున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి పి.మల్లికార్జునరావును వివరణ కోరగా, ఇటీవల ఓవర్ హెడ్ ట్యాంక్‌ను శుభ్రం చేశామని అధికారులతో సంప్రదించి ఫిల్టర్ బెడ్లు సరిగా పనిచేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



బస్సులు ఆపేసి కూర్చున్న డ్రైవర్లు

ఆర్టీసీ హైర్ బస్సు ఆపరేటర్ల
మెరుపు సమ్మె

- ఆర్ఎం తీరుపై యజమానుల ఆగ్రహం.. జగ్గయ్యపేట డిపోలో 30 బస్సుల నిలిపివేత
- విజయవాడ బస్సుల యజమానులకు వెసులుబాట్లపై ఆగ్రహం
- బస్సులు నిలిపివేతతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు

బడా అద్దె బస్సుల యజమానుల ప్రయోజనాల కోసం సమయవేళలు మార్చుతూ ఆర్టీసీ అధికారులు రాత్రికి రాత్రి జారీచేసిన సర్క్యులర్ ఎన్టీఆర్ జిల్లాలో తీవ్ర వివాదాన్ని సృష్టించింది. మిగిలిన అద్దె బస్సుల యజమానుల ఆగ్రహానికి కారణమైంది. అద్దె బస్సులను స్తంభింప చేయటం వరకు వెళ్లింది. అద్దె బస్సులు నిలిచిపోవటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో ఆర్టీసీ ఉన్నతాధికారుల గొంతులో పచ్చివెలక్కాయపడినట్టయింది. ఊహించని పరిణామానికి సాయంత్రం నాటికి సర్క్యులర్‌ను అమలు చేయటం లేదని హామీ ఇవ్వటంతో తాత్కాలికంగా వివాదం సమసింది.

ఆంధ్రజ్యోతి, విజయవాడ/జగ్గయ్యపేట, జూలై 2 : అద్దె బస్సుల యజమానుల ఆందోళనతో 'ఆర్టీసీ'లో చీకటి బాగోతాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట డిపో పరిధిలో అద్దె బస్సుల యజమానులు బుధవారం మెరుపు సమ్మెకు దిగారు. బస్సులను నిలుపుదల చేయటంతో జగ్గయ్యపేట-విజయవాడ మధ్య రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విజయవాడ-జగ్గయ్యపేట మార్గంలో జగ్గయ్యపేట డిపో పరిధిలో తొంభైశాతం పైగా అద్దె బస్సులు నడుస్తున్నాయి. స్వల్ప సంఖ్యలో విజయవాడ నుంచి వచ్చేవి ఉన్నాయి. విజయవాడ నుంచి వచ్చే అద్దె బస్సులకు గత ఐదేళ్లుగా ఆర్టీసీ ఉన్నతాధికారులు పెద్దపీట వేస్తూ వస్తున్నారు. అద్దెబస్సుల సమయాలను తరచూ మార్చుతున్నారు. మొదట్లో జగ్గయ్యపేటకు చెందిన అద్దె బస్సుల యజమానులకు ఇది అర్థం కాక.. ఈ అంశంపై వారు దృష్టి సారించారు. విజయవాడ నుంచి వచ్చే బస్సులను ట్రాఫిక్, రద్దీ లేని సమయంలో టైమింగ్స్ ఇస్తున్నారు. జగ్గయ్యపేటకు చెందిన వారికి మాత్రం రద్దీ సమయాలలో నడిచేలా టైమింగ్‌ను సవరిస్తూ షెడ్యూల్ చేస్తున్నారు. ఐదేళ్లుగా ఇదే తంతు నడుస్తున్నా జగ్గయ్యపేట ప్రాంతానికి చెందిన అద్దె బస్సుల యజమానులు ప్రశ్నించలేదు. మంగళవారం అర్ధరాత్రి ఎన్టీఆర్ జిల్లా ఆర్టీసీ ఉన్నతాధికారులు ఒక సర్క్యులర్ జారీచేశారు. ఈ సర్క్యులర్ ప్రకారం విజయవాడకు చెందిన బస్సులను తెల్లవారుజామున టైమింగ్ ఇస్తూ, మిగిలిన వాటిని ఎనిమిది గంటల తర్వాత సవరించారు. విజయవాడకు చెందిన ఓ బడా అద్దె బస్సు యజమాని కోసం చాలా కాలంగా సమయాలను మార్చుతున్నారు. తాజాగా అదే వ్యక్తికి చెందిన బస్సులను బుధవారం నుంచి తెల్లవారుజామున తిరిగేలా సవరిస్తూ సర్క్యులర్‌ను జారీ చేశారు. ఈ వ్యవహారం వెనుక పెద్ద మతలబే ఉంది. విజయవాడకు చెందిన తమకు అన్నీ చూసిపెట్టే ఇష్టుడైన అద్దె బస్సు యజమాని కోసం ఈ సమయాలను సవరించారన్న విమర్శలు వస్తున్నాయి. ఇలా సవరించటం వల్ల బస్సులో రద్దీ ఉండదు.. తెల్లవారుఝాము సమయంలో ప్రయాణికులు పెద్దగా ఎక్కరు. ఆయిల్ ఖర్చు కూడా తగ్గుతుంది. బస్సు ఏమాత్రం నలగదు. తమకు ఇష్టుడైన అద్దె బస్సు యజమాని ప్రయోజనాల కోసం ఆర్టీసీ ఉన్నతాధికారులు ఏకంగా సర్క్యులర్‌నే జారీచేశారు. జగ్గయ్యపేట స్థానిక అద్దె బస్సుల యజమానులకు తాజా సర్క్యులర్‌తో కడుపు మండింది. అధికారుల నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బస్సులను నిలుపుదల చేశారు. దాదాపుగా 30కి పైగా బస్సులు ఆగిపోయాయి. ఒక్క విజయవాడకు చెందిన అద్దె బస్సు యజమాని మాత్రమే తన బస్సులు తిప్పాడు. అద్దె బస్సుల నిలిపివేతతో ప్రయాణి కులు గొడవ పెట్టడంతో.. చివరికి ఉన్నతాధికారులు దిగి వచ్చి సర్క్యులర్‌ను తాత్కాలికంగా నిలుపుదల చేశారు. దీంతో అద్దె బస్సుల యజమానులు తాత్కాలికంగా ఆందోళనను విరమించారు.



జగ్గయ్యపేట డిపో సమీపంలో నిలిచిపోయిన ఆర్టీసీ అద్దె బస్సులు

అద్దె బస్సుల యాజమాన్యాల నుంచి ఆర్టీసీ ఉన్నతాధికారులకు మామూళ్లు

సంస్థలో అద్దె బస్సుల ముసుగులో ఆర్టీసీ అధికారులు కొందరు కాసుల వేట సాగిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఇటీవలి కాలంలో గడువు ముగిసిన అద్దె బస్సుల స్థానంలో కొత్త వాటికి టెండర్లు పిలవాల్సి ఉండగా.. పాతవాటినే పర్సంటేజీ పెంచి నడిపే విధంగా ఆదేశాలు ఇవ్వటం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. అద్దె బస్సుల యజమానులు ఆర్టీసీ బంకుల్లోనే డీజిల్ కొట్టించుకోవాలనే షరతు విధించారు. ముందే వారికి ఇచ్చే బిల్లుల నుంచి డీజిల్ బిల్లులను మినహాయించుకోవటం.. నెల నెలా ఆర్టీసీ అధికారులకు మామూళ్లు కూడా ముందే చెల్లించాలని షరతు విధించటంతో ఆ ప్రకారం జరిగిపోతోంది. డీజిల్ బిల్లుల పేరుతో కూడా మోసాలకు పాల్పడుతున్నారన్న ఫిర్యాదులు వస్తున్నాయి. జగ్గయ్యపేట వంటి స్థానిక అద్దె బస్సుల యజమానులు ఆర్టీసీ ఎప్పుడు కోరితే అప్పుడు సంక్రాంతికి స్పెషల్ బస్సులు ఇవ్వాల్సి ఉంటుంది. గత సంక్రాంతి బిల్లులు ఇప్పటి వరకు చెల్లించలేదు. ఇలా.. అద్దె బస్సుల యజమానులతో అన్నీ చేయించుకుంటూ అందినకాడికి ఉన్నతాధికారులు ప్రయోజనాలు పొందుతున్నారన్న ఆరోపణలు పెద్ద ఎత్తున వస్తున్నాయి. దీనిపై ప్రభుత్వం తక్షణం విచారణ జరిపించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



తోట చిన్నారి వంటిపై కత్తి గాయాలు

మురుగునీటి వివాదం..
కత్తితో దాడి

గుడ్లవల్లేరు, జూలై 3 : గుడ్లవల్లేరు మండల జనసేన పార్టీ అధ్యక్షుడు తోట చిన్నారిపై వైసీపీకి చెందిన ఊసా దశరథ రామయ్య కుటుంబసభ్యులతో కలిసి కత్తితో దాడి చేశారని బాధితులు ఆరోపిస్తున్నారు. బాధితుడు మెడపై, వెన్ను, ఛాతి భాగంలో కత్తి పోట్లతో రక్త గాయాలు కాగా గుడివాడ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. గతంలోనూ చిన్నారిపై ఒకసారి దాడి చేయగా పోలీసులకు ఫిర్యాదు చేసినా చర్యలు లేక పోవడం వల్లనే మళ్లీ కత్తితో దాడి చేశారని బాధితుని కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాధితుడు తోట చిన్నారి, దాడికి పాల్పడిన ఊసా దశరథ రామయ్య కుటుంబం ఎదురెదురు ఇళ్లలోనే వడ్లమన్నాడు గ్రామంలో నివసిస్తున్నారు. దశరథ రామయ్య ఇంటికి సంబంధించిన మురుగు చిన్నారి ఇంటివైపు వదులుతున్న విషయంపై వీరిరువురికీ గతంలోనూ ఘర్షణ జరిగింది. తిరిగి బుధవారం ఉదయం 10 గంటల సమయంలో వివాదం చెలరేగింది. గొడవ జరుగుతుండగా దశరథ రామయ్య, అతడి భార్య రామలక్ష్మి దాడిచేస్తూ, కుమారుడు సాయికుమార్‌ని ప్రోత్సహించడంతో కత్తితో విచక్షణా రహితంగా పొడిచాడని, బాధితుల ఫిర్యాదు మేరకు గుడ్లవల్లేరు ఎస్ఐ సత్యనారాయణ హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రానికే మోడల్‌గా మల్లవల్లి

- అన్ని సౌకర్యాలతో పారిశ్రామికవాడగా తీర్చిదిద్దుతాం : మంత్రి భరత్
- సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూలై 3 : మల్లవల్లి పారిశ్రామికవాడలో అవసరమైన మౌలికసదుపాయాలను కల్పిస్తూ, సమస్యలను త్వరతగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటూ రాబోయే కాలంలో రాష్ట్రానికే మోడల్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని పరిశ్రమలశాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. మల్లవల్లి పారిశ్రామికవాడను బుధవారం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుతో కలిసి సందర్శించారు. పారిశ్రామికవేత్తగా తనకు పరిశ్రమను నడపడం ఎంత కష్టమో తెలుసని, యువతకు ఉపాధి కల్పించే పారిశ్రామకవేత్తలను ప్రోత్సహించాల్సిన బాధ్యత మనపై ఉందని మంత్రి అధికారులకు సూచించారు. విద్యుత్, నీరు, లాంటి మౌలికసదుపాయాలతో పాటు భద్రత కల్పించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ డీకే బాలాజీ, జోనల్ మేనేజర్ సీతారాంకు ఆదేశాలు జారీ చేశారు. రైతుల సమస్యలను ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆధ్వర్యంలో త్వరితగతిన పరిష్కరించాలని ఏపీఐఐసీ అధికారులకు మంత్రి సూచించారు. ప్రభుత్వం మారిన తరువాత చాలామంది పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారన్నారు. చంద్రబాబు అంటేనే అభివృద్ధికి బ్రాండ్ అని.. మల్లవల్లి పారిశ్రామికవాడను రాష్ట్రానికే మోడల్‌లా చేసి చూపించాల్సిన బాధ్యత మనపై ఉందని ఎమ్మెల్యే యార్లగడ్డ అన్నారు. పారిశ్రామికవాడలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ప్రధాన సమస్య అని పారిశ్రామికవేత్తలు తెలపడంతో అంతరాయం ఏర్పడకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని మంత్రి భరత్ విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. అశోక్‌లేలాండ్ లాంటి పెద్ద బ్రాండ్‌లు ఫ్యాక్టరీలు ఏర్పాటు చేసేందుకు వస్తున్న సమయంలో మౌలికసదుపాయాలపై ప్రత్యేకశ్రద్ధ చూపాలని మంత్రి అధికారులకు సూచించారు. కలెక్టర్ బాలాజీ, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆధ్వర్యంలో అన్ని సమస్యలను రోజుల వ్యవధిలోనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అదేశాలు జారీ చేశారు. మల్లవల్లి మోడల్ పారిశ్రామికవాడను రాష్ట్రానికే ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు, పరిశ్రమలు నెలకొల్పే ఔత్సాహికపారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలోని ప్రభుత్వం అవసరమైన సహకారమందించేందుకు సిద్ధంగా ఉందని పరిశ్రమలమంత్రి భరత్ తెలిపారు. కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన పారిశ్రామికవేత్తలు, అధికారులు హాజరయ్యారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి భరత్

ఇంటర్ లాకింగ్ పనులు.. పలు రైళ్ల రద్దు



రైల్వేస్టేషన్, జూలై 3 : విజయవాడ కొత్త వెస్ట్ బ్లాక్ హట్ మధ్య మూడవ లైన్ నిర్మాణం నేపథ్యంలో ప్రీ నాన్ ఇంటర్ లాకింగ్, నాన్ ఇంటర్ లాకింగ్ పనుల నిమిత్తం ఆగస్టు 3వ తేదీ నుంచి పలు రైళ్లను కొన్ని రోజుల పాటు రద్దు చేస్తున్నట్లుగా విజయవాడ డివిజనల్ పీఆర్వో నుస్రత్ ఎం మండ్రూప్కర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇదే సమయంలో కొన్ని రైళ్లను రూట్ మళ్లిస్తున్నట్లు పేర్కొన్నారు. విజయవాడ-భద్రాచలం రోడ్డు అప్ అండ్ డౌన్, తెనాలి-విజయవాడ అప్ అండ్ డౌన్ రైళ్లను ఆగస్టు 5 నుంచి 10వ తేదీ వరకు రద్దు చేస్తున్నారు. 07630 తెనాలి- విజయవాడ, 07500 విజయవాడ- గూడూరు రైళ్లను 3 నుంచి 10వ తేదీ వరకు రద్దు చేస్తున్నారు. 07458 గూడూరు- విజయవాడ, 07781 విజయవాడ- మచిలీపట్నం రైళ్లను 4 నుంచి 11వ తేదీ వరకు, మాచర్ల- విజయవాడ, విజయవాడ-తెనాలి, విజయవాడ-గుంటూరు, గుంటూరు- విజయవాడ, విజయవాడ-డోర్నకల్, డోర్నకల్-విజయవాడ రైళ్లను 5 నుంచి 10 వరకు రద్దు చేస్తున్నారు. నర్సాపూర్-విజయవాడ, విజయవాడ-బిట్రగుంట రైళ్లను 3 నుంచి 10వ తేదీ వరకు, బిట్రగుంట-చెన్నై సర్కిల్ అప్ అండ్ డౌన్ రైలును 4 నుంచి 11వ తేదీ వరకు రద్దు చేస్తున్నారు. బిట్రగుంట- విజయవాడ, విజయవాడ-నర్సాపూర్ రైళ్లను 5 నుంచి 12వ తేదీ వరకు, నర్సాపూర్-గుంటూరు రైలును 4 నుంచి 10వ తేదీ వరకు రద్దు చేస్తున్నారు. గుంటూరు-రేపల్లె అప్ అండ్ డౌన్, గుంటూరు-విజయవాడ, విజయవాడ- నర్సాపూర్ రైళ్లను 5 నుంచి 11వ తేదీ వరకు, విజయవాడ-సికింద్రాబాద్ అప్ అండ్ డౌన్ రైలును 5 నుంచి 10వ తేదీ వరకు, గుంటూరు-సికింద్రాబాద్, సికింద్రాబాద్-గుంటూరు అప్ అండ్ డౌన్ రైళ్లను 5 నుంచి 10వ తేదీ వరకు రద్దు చేస్తున్నారు. బొబ్బిలి-విజయవాడ రైలు 4 నుంచి 10వ తేదీ వరకు, విజయవాడ హుబ్లీ రైలు 5 నుంచి 11వ తేదీ వరకు, విశాఖపట్నం-కడప రైలును 5 నుంచి 10వ తేదీ వరకు, కడప-విశాఖపట్నం రైలును 6 నుంచి 11వ తేదీ వరకు, విజయవాడ-చెన్నై సెంట్రల్ అప్ అండ్ డౌన్ రైలు 5 నుంచి 10వ తేదీ వరకు రద్దు చేస్తున్నారు. మంగళవారం తప్ప మిగతా రోజుల్లో నడిచే చెన్నై సెంట్రల్- విజయవాడ రైలును 5, 7, 8, 9, 10 తేదీల్లో రద్దు చేస్తున్నారు. తిరుగు ప్రయాణంలో ఇదే రైలును ఆదే రోజుల్లో రద్దు చేస్తున్నారు.

దారి మళ్లింపు..

సికింద్రాబాద్-విశాఖపట్నం రైలును ఆగస్టు 2 నుంచి 10వ తేదీ వరకు, రాయనపాడు-గుణదల బైపాసింగ్ ద్వారా మళ్లిస్తారు. వీటికి విజయవాడలో స్టాపింగ్ ఉండదు. రాయనపాడులో టెంపరరీ స్టాపింగ్ ఏర్పాటు చేశారు. గాంధీనగర్-విశాఖపట్నం రైలును ఆగస్టు 4వ తేదీన, ఒకాపూరీ ఎక్స్‌ప్రెస్‌ను 7వ తేదీన, నిజాముద్దీన్ విశాఖపట్నం రైలును 4, 7 తేదీల్లో, ఛత్రపతి శివాజీ టెర్మినస్ భువనేశ్వర్ రైలును 2 నుంచి 10వ తేదీ వరకు దారి మళ్లిస్తారు. రాయనపాడు-గుణదల బైపాసింగ్ ద్వారా ఈ రైళ్లను నడుపుతారు. విజయవాడలో స్టాపింగ్ బదులు రాయనపాడులో తాత్కాలికంగా స్టాపింగ్ ఏర్పాటు చేశారు. యశ్వంత్‌పూర్- టాటా 4వ తేదీన, హైదరాబాద్ -షాలీమార్ 3 నుంచి 11వ తేదీ వరకు, షిరిడీ సాయినగర్-కాకినాడ పోర్టు 4, 6, 8 తేదీల్లో, ఇదే రైలు షిరిడీ సాయినగర్- విశాఖపట్నం ఆగస్టు 2, 9 తేదీల్లో, న్యూఢిల్లీ- విశాఖపట్నం 2 నుంచి 10వ తేదీ వరకు, హైదరాబాద్-విశాఖపట్నం 3 నుంచి 11వ తేదీ వరకు, విశాఖపట్నం-సికింద్రాబాద్ రైలు 2 నుంచి 10వ తేదీ వరకు, విశాఖపట్నం-న్యూఢిల్లీ 2 నుంచి 10వ తేదీ వరకు, భువనేశ్వర్-ఛత్రపతి శివాజీ టెర్మినల్ 2 నుంచి 10వ తేదీ వరకు, కాకినాడ పోర్టు- షిరిడీ సాయినగర్ 3, 5, 7, 10 తేదీల్లో, షాలీమార్- హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ 2 నుంచి 10వ తేదీ వరకు, విశాఖపట్నం-నిజాముద్దీన్ 5, 9 తేదీల్లో, విశాఖపట్నం-షిరిడీ సాయినగర్ రైలు 8న, టాటా- యశ్వంత్‌పూర్ 8వ తేదీన, విశాఖపట్నం-హైదరాబాద్ రైలు 3, 11 తేదీల్లో, విశాఖపట్నం- గాంధీనగర్ రైలును 8న, పూరీ ఒకా రైలును 5వ తేదీన, విశాఖపట్నం-లోకమాన్య తిలక్ టెర్మినస్ రైలు 2 నుంచి 10వ తేదీ వరకు, మచిలీపట్నం-షిరిడీ సాయినగర్ 6వ తేదీన దారి మళ్లిస్తున్నారు. నర్సాపూర్, నాగర్ సోల్ 3, 5, 6, 7, 8, 10 తేదీల్లో, మచిలీపట్నం-బీదర్ రైలును 3 నుంచి 11వ తేదీ వరకు, లోకమాన్య తిలక్ టెర్మినస్-విశాఖపట్నం రైలును 2 నుంచి 10వ తేదీ వరకు, షిరిడీసాయినగర్ మచిలీపట్నం రైలును 7వ తేదీన, నాగర్‌సోల్-నర్సాపూర్ రైలును 2, 4, 6, 7, 8, 9 తేదీల్లో, బీదర్-మచిలీపట్నం రైలును 2 నుంచి 10వ తేదీ వరకు రాయనపాడు-గుణదల బైపాసింగ్ ద్వారా నడుపుతారు. రాయనపాడులో మాత్రమే స్టాపింగ్ ఉంటుంది. హైదరాబాద్- తాంబరం ఎక్స్‌ప్రెస్‌ను ఆగస్టు 2 నుంచి 10వ తేదీ వరకు, సికింద్రాబాద్-తిరుపతి రైలును 2, 4, 5, 6, 8, 9 తేదీల్లో దారి మళ్లిస్తారు. సికింద్రాబాద్- గుడూరు 2 నుంచి 10వ తేదీ వరకు, ఆదిలాబాద్-తిరుపతి 2 నుంచి 10వ తేదీ వరకు, తాంబరం- హైదరాబాద్ 2 నుంచి 10వ తేదీ వరకు, తిరుపతి-సికింద్రాబాద్ 3, 5, 6, 7, 9, 10 తేదీల్లో, గూడూరు- సికింద్రాబాద్ 3 నుంచి 9వ తేదీ వరకు, తిరుపతి-ఆదిలాబాద్ 3 నుంచి 9వ తేదీ వరకు దారి మళ్లిస్తారు.



కవలలు, మృతురాలు జంపన మాధవి (ఫైల్‌ఫొటో)

కాన్పుకోసం వచ్చి..
తల్లీ కవలల మృతి!

- వైద్యుల నిర్లక్ష్యమేనని బాధితుల ఆందోళన
- ఆసుపత్రిలో ప్రమాణాలపై ప్రత్యేక కమిటీ
- నివేదిక వచ్చాక చర్యలు.. డీఎంహెచ్‌వో వెల్లడి

పటమట, జూలై 3 : గంగూరు గ్రామానికి చెందిన జంపన మాధవి(24) పురిటినొప్పులతో బాధపడుతుంటే సోమవారం కుటుంబసభ్యులు పద్మావతి ఆసుపత్రిలో ప్రసవం కోసం చేర్పించారు. మాధవి ఒక బిడ్డకు సహజ ప్రసవం ద్వారా జన్మనిచ్చింది. పుట్టిన బాబు వెంటనే చనిపోయాడు. రెండో బిడ్డను ఆసుపత్రి వైద్యులు సిజేరియన్ ద్వారా బయటకు తీశారు. పుట్టిన వెంటనే ఆ బాబు కూడా చనిపోయాడు. తల్లి ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో ఆసుపత్రి యాజమాన్యం నగరంలో ప్రముఖ కార్పొరేట్ హాస్పిటల్‌కు మెరుగైన వైద్యం కోసం తరలించారు. చికిత్స పొందుతూ.. ఆరోగ్యం విషమించంతో మాధవి బుధవారం కన్నుమూసింది. ఆమెకు రక్తహీనత, కామెర్లు, ఓవర్ బ్లీడింగ్ సమస్యలతో బాధపడుతున్నట్టు ఆసుపత్రి వర్గాలు తెలియజేశాయి. ఆమె భర్త ప్రశాంత్ గంగూరు సచివాలయ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్నాడు. వీరికి 14 నెలలు బాబు ఉన్నాడు. మృతురాలి బంధువులు ఆసుపత్రి వద్ద ఆందోళన నిర్వహించారు. మాధవి మృతదేహాన్ని పటమట హాస్పిటల్‌కు తీసుకువచ్చి ఆందోళన నిర్వహించేందుకు సిద్దపడగా, పోలీసులు వారికి సర్దిచెప్పి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పెనమలూరు ఎమ్మెల్యే బోడెప్రసాద్ గవర్నమెంట్ హాస్పిటల్‌లో మృతురాలి కుటుంబసభ్యులను పరామర్శించారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు పటమట సీఐ మోహనరెడ్డి, సెక్టార్ ఎస్ఐ వల్లి పద్మ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆసుపత్రి ప్రమాణాలపై కమిటీ..

పద్మావతి ఆసుపత్రిలో వైద్యం తీరుపై తమకు ఇప్పటికే పలు ఫిర్యాదులు వచ్చాయని, ఈ మేరకు మాధవి మృతిపట్ల బంధువులు తమకు సమాచారం ఇవ్వడంతో కమిటీని వేయడం జరిగిందని ఎన్టీఆర్ జిల్లా వైద్య అధికారిణి సుహాసిని తెలిపారు. సరైన వైద్య ప్రమాణాలు పాటించని ఆసుపత్రులను సీజ్ చేస్తామని ఆమె హెచ్చరించారు.

ఉప లోకాయుక్త ఆదేశాలు..
ఇంక్రిమెంట్లు కట్

కర్నూలు(లీగల్), జూలై 3 : నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ డాక్యుమెంట్లను, వెబ్‌ల్యాండ్ వివరాలను అప్పటి జిల్లా గన్నవరం తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్లు మార్పులు చేర్పులు చేశారనే ఫిర్యాదులపై రాష్ట్ర ప్రభుత్వం ఇద్దరి ఇంక్రిమెంట్లలో కోత విధించినట్టు ఉప లోకాయుక్తకు తెలిపింది. అప్పటి గన్నవరం తహసీల్దార్ ములుగు మాధురి, సబ్ రిజిస్ట్రార్ బి.సాయికృష్ణారెడ్డిలపై గన్నవరానికి చెందిన మాజీ సైనికోద్యోగి ముప్పనేని రవికుమార్ రాష్ట్ర ఉప లోకాయుక్తకు 2016లో ఫిర్యాదు చేశారు. దీంతో ఫిర్యాదిపై విచారించి తగు చర్యలు తీసుకోవాలని ఉప లోకాయుక్త రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ అధికారులు విచారించి అక్రమాలకు పాల్పడిన తహసీల్దార్ ములుగు మాధురికి రెండు ఇంక్రిమెంట్లు, సబ్ రిజిస్ట్రార్ బి.సాయికృష్ణారెడ్డికి ఒక ఇంక్రిమెంటును ఒక ఏడాదిపాటు కోత విధించినట్లు ఉప లోకాయుక్తకు తెలిపింది.



గౌరంపాలెంలో సర్వే చేస్తున్న అధికారులు

వైసీపీ నేత ఆక్రమిత భూమి సర్వే

విస్సన్నపేట, జూలై 3 : తాతకుంట్ల శివారు గౌరంపాలెం గ్రామంలో వైసీపీ నేత ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని నిర్మాణాలు చేపట్టినట్టు వచ్చిన ఫిర్యాదు మేరకు ఆర్ఎస్ నంబరు 378లో 10.24 ఎకరాల భూమిలో బుధవారం మండల సర్వేయర్ శంకర్రావు ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. భూమి ఆక్రమణలకు గురైనట్టు సర్వేలో గుర్తించామని, ఆక్రణదారులకు నోటీసులు ఇస్తామని పంచాయతీ కార్యదర్శి ఆదినారాయణ తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

మచిలీపట్నం టౌన్, జూలై 3 : ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రదానం చేసే ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఈనెల 15లోగా వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీఈవో తాహెరా సుల్తానా తెలిపారు. జిల్లాలోని ఉప, మండల విద్యాశాఖాధికారులు తమ పరిధిలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను సిఫార్సులతో షెడ్యూల్ ప్రకారం దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పంపాలన్నారు. అధికారుల సిఫార్సులు లేని, మెయిల్ ద్వారా, మాన్యువల్‌గా వచ్చిన దరఖాస్తులు స్వీకరించరన్నారు.

ఇల్లు ఖాళీ చేయమన్నందుకు
హత్యాయత్నం

- నిందితుడి అరెస్టు

జి.కొండూరు, జూలై 3 : ఇల్లు ఖాళీ చేయనని గొడవకు దిగడమే కాకుండా సర్ది చెప్పేందుకు వెళ్లిన పెద్దలపై పెట్రోల్ పోసి హత్యాయత్నానికి పాల్పడిన ఓ ప్రబుద్ధుని వైనమిది. పోలీసుల కథనం ప్రకారం.. తిరువూరుకు చెందిన సంక్రాంతి సత్యకృష్ణ భార్యతో కలిసి రెండు మాసాల క్రితం వెల్లటూరు వచ్చి మాడుగల లక్ష్మీకుమారి ఇంట్లో అద్దెకు ఉంటూ అక్కడే కర్రీ పాయింట్ నడుపుతున్నాడు. రోజూమద్యం సేవించి అల్లరి చేస్తుండటంతో ఇల్లు ఖాళీ చేయమని లక్ష్మీకుమారి అతడికి చెప్పింది. అతడు గొడవకు దిగడంతో విషయం పెద్దలకు చెప్పింది. గ్రామానికి చెందిన పచ్చిగోళ్ల బాలకృష్ణ మరో ఇద్దరు గొడవ సర్దుబాటు చేసేందుకు రాగా.. సత్యకృష్ణ వారిపై పెట్రోల్ పోసి నిప్పుపెట్టే ప్రయత్నం చేశాడు. ఇంటి యజమానురాలి ఫిర్యాదు మేరకు సత్యకృష్ణను అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్టు ఎస్సై షబ్బీర్ అహమ్మద్ తెలిపారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	120, 129, 140
చికెన్ విత్ స్కిన్	226
చికెన్ స్కిన్‌లెస్	236

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.40

మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు

ఈడుపుగల్లు (కంకిపాడు), జూలై 3 : గ్రామంలో మురుగు సమస్య లేకుండా తగు చర్యలు చేపడుతున్నామని ఈడుపుగల్లు సర్పంచ్ పందిపాటి ఇందిర అన్నారు. ఎస్సీ కాలనీల్లో పలు డ్రెయిన్లు పూడికతీత పనులను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పందిపాటి ఇందిర మాట్లాడుతూ గ్రామంలోని ఎస్సీ కాలనీ, బీసీ కాలనీలో పూడికుపోయిన డ్రెయిన్లు అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో కూడా ప్రజలు మురుగునీరు నిలువ లేకుండా జాగ్రత్త పడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కిలారు శ్రీనివాసరావు, అనుమోలు రామకృష్ణ, పందిపాటి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



కడవకొల్లు పాఠశాలలో పుస్తకాలు పంపిణీ చేస్తున్న భానుప్రతాప్

నోట్ పుస్తకాల పంపిణీ

కడవకొల్లు(ఉయ్యూరు), జూలై 3 : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు తోచిన విధంగా సాయం చేయడం అభినందనీయమని కడవకొల్లు సర్పంచ్ సుధారాణి అన్నారు. ఉయ్యూరుకు చెందిన బూరగడ్డ భానుప్రతాప్ ఆధ్వర్యంలో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు రూ. 20 వేలు విలువ చేసే నోటుపుస్తకాలు బుధవారం పంపిణీ చేశారు. ఎంఈవో1 పద్మారాణి, ఎంఈవో 2 సుధారాణి, ఎస్ఎంసీ ఛైర్మన్ ప్రియాంక, పాఠశాల హెచ్ఎం శ్రీధర్‌రెడ్డి భానుప్రతాప్‌ను అభినందించారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : సామాజిక సేవలే లక్ష్యంగా పనిచేస్తున్న వీక్యూబ్ ఫౌండేషన్ విద్యాభివృద్ధికి పుస్తకాల పంపిణీ చేపట్టినట్లు ఫౌండ ర్ వీరరాఘవరావు తెలిపారు. ఆరుగొలను హైస్కూల్ హెచ్ఎం దుర్గాప్రసాద్ అధ్యక్షతన బుధవారం నిర్వహిం చిన కార్యక్రమంలో 3,4,5 తరగతుల విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీక్యూబ్ ఫౌండేషన్ సభ్యులు అంకాలరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూతన టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి



అన్న సమారాధనను ప్రారంభిస్తున్న రాజేంద్రప్రసాద్

ఉయ్యూరు, జూలై 3 : కాలమాన పరిస్థితుల కనుగుణంగా నూతన టెక్నాలజీ అందిపుచ్చుకుని మెకానిక్ రంగంలో రాణించాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ అన్నారు. అంతర్జాతీయ టూవీలర్ దినోత్సవం పురస్కరించుకుని బుధవారం మెకానిక్‌లు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక శిరీషా దివ్యాంగ బాలల పునరావాస కేంద్రంలో బాలలకు మెకానిక్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన అన్న సమారాధనను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మెకానిక్ సంఘ నాయకులు పాల్గొన్నారు.

విదేశీ నిపుణుల బృందాన్ని కలిసిన సాగునీటి సంఘ ప్రతినిధులు



పోలవరంలో జలశక్తి ప్రపంచ సలహాదారు రిచెర్డ్ డోనెల్లితో సాగునీటి సంఘాల నాయకులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూలై 3 : ఆంధ్రుల జీవనాడి పోలవరం ప్రాజెక్టుకు గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల జరిగిన నష్టాన్ని అంచనా వేస్తూ నివారణ చర్యలను సూచించేందుకు వచ్చిన అంత ర్జాతీయ నిపుణుల బృందాన్ని రాష్ట్ర సాగునీటి సమాఖ్య అధ్యక్షుడు ఆళ్ల గోపాలకృష్ణ మర్యాద పూర్వకంగా కలిశారు. పోలవరం ప్రాజెక్ట్ అతిథి గృహంలో బుధవారం విదేశీ నిపుణులను మర్యాదపూర్వకంగా కలిసి రైతు కండువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కృష్ణా తూర్పు డెల్టా ప్రాజెక్ట్ కమిటీ మాజీ ఛైర్మన్ గుత్తా శివరామకృష్ణ, నీరు-చెట్టు కోఆర్డినేషన్ కమిటీ సభ్యుడు కవులూరి చంద్రమౌళి పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం



బాధ్యతలు తీసుకుంటున్న టీఎస్ఆర్‌కే ప్రసాద్

గన్నవరం, జూలై 3 : రోటరీ క్లబ్ ఆఫ్ గన్నవరం శాఖ నూతన కార్యవర్గం బుధవారం బాధ్యతలు స్వీకరించింది. స్థానిక కొత్తపేటలోని రోటరీ ఆడిటోరియంలో క్లబ్ నూతన అధ్యక్షులుగా టీఎస్ఆర్‌కే ప్రసాద్, కార్యదర్శిగా జీవి రవిబాబు, మిగిలిన కార్యవర్గంతో రోటరీ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎంవీ ప్రసాద్ ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో రోటరీ క్లబ్ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. 2023-24లో గన్నవరం శాఖ అత్యుత్తమ సేవలు అందించినట్లు తెలిపారు. అసిస్టెంట్ గవర్నర్ జీ.శ్రీహర్ష, తాజా మాజీ అధ్యక్ష కార్యదర్శులు జాస్తి విజయభూషణ్ కుమార్, నర్రా సీతారామారావు, జాస్తి ఫణిశేఖర్, పి.మురళీకృష్ణ, జి.త్రివేది తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గుమస్తా మృతి

గుడివాడ రూరల్, జూలై 3: గుడివాడ రూరల్ మండలం శేరీదింటకుర్రులో రొయ్యల చెరువుపై గుమస్తాగా పని చేస్తున్న పెడన మండలానికి చెందిన చుక్కా మునియ్య(46) విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల బుధవారం మరణించాడు. వైరు తెగిపోవటంతో పక్కన ఉన్న వ్యక్తితో విద్యుత్‌ను నిలుపుదల చేయమని చెప్పాడు. అతను విద్యుత్ నిలుపుదల చేసే లోపే వైరును టేపు చుట్టడానికి పట్టుకున్నాడు. దీంతో షాక్ తగిలి అక్కడికక్కడే అతను మరణించాడు. అతనికి భార్య, ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. గుడివాడ ఏరియా ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించారు.

కౌలురైతులకు గుర్తింపు కార్డులివ్వాలి

గుడివాడ: కౌలురైతులకు షరతులు లేకుండా గుర్తింపు కార్డులివ్వాలని కౌలు రైతు సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యే వెనిగండ్ల రాముకు బుధవారం వినతిపత్రం అందించారు. సంఘం జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు, గంటా అక్కయ్య, లేళ్ల రాంబాబు, బీవీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యువతకు ఉపాధే లక్ష్యం

పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్



వీసీ న్యూట్రీఫుడ్స్‌లో మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూలై 3 : యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించే విధంగా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిం చడమే ప్రభుత్వ లక్ష్యమని పరిశ్రమలశాఖ మంత్రి టీ.జీ. భరత్ అన్నారు. మల్లవల్లి మోడల్ ఇండస్ట్రియల్ పార్క్‌లోని పలు ఫ్యాక్టరీలను ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుతో కలిసి ఆయన సందర్శించారు. వీసీ న్యూట్రీఫుడ్స్, మోహన్ స్పింటెక్స్ ఫ్యాక్టరీలను పరిశీలించారు. అమెరికాలో ఉద్యోగం చేస్తున్న వంశీకృష్ణ, తన సోదరుడు చైతన్యతో కలిసి వీసీ న్యూట్రీఫుడ్స్ ఏర్పాటు చేసి వెయ్యిమందికి ఉద్యోగాలు కల్పించడం అభినందనీయమన్నారు. తమ ప్రభుత్వం పరిశ్రమల ఏర్పాటుకు, పారిశ్రామికాభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బ్రాండ్ ఇమేజ్‌కు తోడు తాము కూడా కష్టపడి పనిచేస్తూ పారిశ్రామికంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. విద్యావంతుడైన యార్లగడ్డ వెంకట్రావును ఎమ్మెల్యేగా ఎన్నుకోవడం గన్నవరం నియోజక వర్గ ప్రజల అదృష్టంగా ఆయన పేర్కొన్నారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ, మల్లవల్లి మోడల్ ఇండస్ట్రియల్ పార్క్‌ను రాష్ట్రంలోనే అతిపెద్ద పారి శ్రామికవాడగా తీర్చిదిద్దాలనేది తన ప్రధాన లక్ష్యమన్నారు. ఇప్పటికే పారిశ్రామికవేత్తలు, అధికారులతో నాలుగుసార్లు సమీక్ష నిర్వహించానన్నారు. సమస్యలను సత్వరం పరిష్కరించగలిగితేనే పరిశ్రమల స్థాపనకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మల్లవల్లికి చెందిన పారిశ్రామికవేత్తలు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ డీ.కే. బాలాజీ పారిశ్రామికవాడలోని సమస్యలను వేగవంతంగా పరిష్కరించేందుకు రెవెన్యూ, పంచాయతీ, పోలీసు, విద్యుత్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

సమన్వయంతో పనిచేద్దాం



టీడీపీ, జనసేన, బీజేపీ జెండా దిమ్మెను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్, ముప్పా రాజా

కుందేరు (కంకిపాడు), జూలై 3 : ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం సమన్వయంతో పనిచేస్తుందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. మండలంలోని కుందేరులో ఏర్పాటు చేసిన టీడీపీ, జనసేన, బీజేపీ జెండా దిమ్మెలను జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ముప్పా రాజాతో కలిసి బుధవారం ఆయన ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పెనమలూరు నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉమ్మడి ప్రభుత్వం సమష్టిగా పనిచేస్తుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి అక్రమాలను అరికడతామని, కుందేరులో పెండింగ్‌లో ఉన్న వంతెన నిర్మాణ పనులు చేయకపోవడం దురదృష్టకరమన్నారు. సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి వంతెన నిర్మాణ పనులు వేగవంతం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చలసాని వెంకటేశ్వరరావు, ఆళ్ల నాని, రెడ్డి, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

తరలిపోతున్న గ్రావెల్!

- మల్లవల్లిలో అర్ధరాత్రి తవ్వకాలు
- అధికారుల అండతో పేటేగిపోతున్న అక్రమార్కులు
- ప్రభుత్వం మారినా కొనసాగుతున్న వైసీపీ నేతల అక్రమదందా



అర్ధరాత్రి గ్రావెల్ తరలిస్తున్న లారీలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూలై 3 : మల్లవల్లిలోని భూముల్లో గ్రావెల్ అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. గత ప్రభుత్వంలో గ్రావెల్ తవ్వకాలను పట్టించుకోకపోవడం, ప్రజాప్రతినిధులే క్వారీ నడపడంతో అడ్డుఅదుపు లేకుండా గ్రావెల్ తవ్వకాలు జరిగాయి. అక్రమ తవ్వకాలపై కథనాలు ప్రచురించినా అధికారుల్లో చలనం లేదు. ప్రస్తుతం ప్రభుత్వం మారినా అధికారుల అండదండలతో అదే ప్రజాప్రతినిధులు చేస్తున్న గ్రావెల్ అక్రమ తవ్వకాలు ఆగకపోగా అర్ధరాత్రి పూట జోరుగా సాగుతున్నాయి. గనులశాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఆత్మీయ సమావేశానికి హాజరైన మరుసటి రోజునే గ్రావెల్ తరలింపు ఊపందుకోవడం గమనార్హం. ఇటీవల వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చిన కొంతమంది బడానాయకుల ప్రోద్బలంతోనే గ్రావెల్ తోలకాలు జరుగుతున్నాయని స్థానికులు అంటున్నారు. తవ్విన గ్రావెల్‌ను అక్రమంగా లారీల్లో మంగళవారం అర్ధరాత్రి తరలిస్తుండగా మల్లవల్లి గ్రామస్తులు అడ్డుకున్నారు. బుధవారం తెల్లవారు ఝాము వరకు లారీలను కదలనివ్వక పోవడం, వీరవల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో లారీలను పోలీసులు స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

పర్యావరణానికి పెనుముప్పు ప్లాస్టిక్

ఉంగుటూరు, జూలై 3 : పర్యావరణానికి పెనుముప్పుగా మారిన ప్లాస్టిక్ సంచుల (క్యారీబ్యాగ్‌లు)విపరీత వాడకానికి స్వస్తిపలికి, పర్యావరణ అనుకూల ప్రత్యామ్నాయాలైన పేపర్, క్లాత్, జనపనార(జూట్)సంచుల వినియోగాన్ని పెంచాలని, తద్వారా భవిష్యత్ తరాలకు ప్లాస్టిక్ రహిత సమాజాన్ని అందించాలని తేలప్రోలు ఉషారామా ఇంజ నీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జీవీకేఎస్‌వీ ప్రసా ద్ సూచించారు. అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవం సందర్భంగా ఎన్ఎస్ ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వి. శ్రీహరిబాబు నేతృత్వంలో బుధవారం స్థానిక కళాశాలలో రెండువేలమంది విద్యార్థినీ, విద్యార్థులకు క్లాత్‌బ్యాగ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జీవీకేఎస్‌వీ ప్రసాద్, ఐటీ విభాగాధిపతి వై.వరప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



క్లాత్‌సంచుల పంపిణీని ప్రారంభిస్తున్న అధ్యాపకులు

ఉయ్యూరు : అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవం పురస్కరించుకుని ఏజీ అండ్ ఎస్ జీఎస్ కళాశాల జంతు, వృక్షశాస్త్రం, ఎకో క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం వ్లల అన ర్థాలపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ వాడకం వల్ల కాలుష్యం తగ్గించానికి, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఉపయోగించకుండా ప్రజలకు అవగాహన కలిగించడానికి ఉపయోగపడే పోస్టర్ ప్రజంటేషన్ చేశారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగించడం వల్ల సంవత్సరాల పాటు మట్టిలో కలసిపోకుండా ఉంటుందని, తద్వారా కలిగే హానిపై ప్రజలకు అవగాహన కల్పించా లని ప్రిన్సిపాల్ ఎం.శివనాథ్ విద్యార్థులకు సూచించారు. కళాశాల ప్రత్యేక అధికారి సత్యనారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

రోడ్లపైనే మురుగు!

- పూడుకుపోయిన డ్రెయిన్లు
- పూర్తిగా ధ్వంసమైన రోడ్లు
- అధ్వానంగా పారిశుధ్యం
- వెదజల్లుతున్న దుర్గంధం
- ఇబ్బందిపడుతున్న ప్రయాణికులు



ధ్వంసమైన కానూరు ప్రధాన రోడ్డు.. రోడ్డుపైన నిలిచిపోయిన మురుగు

పెనమలూరు, జూలై 3 : పెనమలూరు మండలంలో ఏ గ్రామంలో చూసినా చెత్తకుప్పలతో రోడ్లు దర్శనమిస్తున్నాయి. గ్రామ పంచాయతీల బాధ్యులు చెత్తచెదారం డంపింగ్‌ను పట్టించుకోకపోవడం, చెత్తను తొలిగించిన తర్వాత బ్లీచింగ్ చేయించకపోవడంతో రోడ్లు కంపు కొడుతున్నాయి. చెత్త తొలగింపు, బ్లీచింగ్‌కు ప్రభుత్వం కేటాయిస్తున్న లక్షల నిధులు సక్రమంగా వినియోగించి పారిశుధ్య మెరుగుకు కృషి చేయాల్సిన అధికారులు నిధులను పక్క దోవ పట్టిస్తూ ప్రజలను గాలికొదిలేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పెనమలూరు, చోడవరం, పెదపులిపాక, కానూరు, పోరంకి, తాడిగడప, యనమలకుదురు గ్రామాల్లో చెత్త నిర్వహణ దయనీయంగా మారింది. కానూరు సనత్‌నగర్ పంట కాల్వ రోడ్డు మలుపు వద్ద, సూపర్‌విజ్ రోడ్డులో దుర్వాసనకు రోడ్డు వెంట ప్రయాణించలేకపోతున్నారు. అసలే వర్షాకాలం, పైగా అపరిశుభ్రతతో జ్వరాలు, డయేరియాలాంటి సీజనల్ వ్యాధులు ప్రబలుతాయని స్థానికులు భయపడుతున్నారు.

ఎక్కడికక్కడ రోడ్లు ధ్వంసం

మండలంలోని పలుగ్రామాలకు అనుసంధానంగా ఉన్న ప్రధాన రోడ్లు ధ్వంసం కావడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. తాడిగడప ప్రధాన రోడ్డును పెదపులిపాకతో అనుసంధానించే రోడ్డుపై ఎక్కడ చూసినా గుంతలే కనిపిస్తున్నాయి. కృష్ణా కరకట్ట వైపు నుంచి పెదపులిపాక మీదుగా బందరు రోడ్డు వైపు భారీ వాహనాలు రాకపోకలు కొనసాగిస్తుండడంతో రోడ్డుకు గత మూడేళ్లుగా రోడ్డు పొడవునా గుంతలు పడుతూనే ఉన్నాయి. కానీ గుంతలు పూడ్చిన దాఖలాలు లేకపోవడంతో తాడిగడప, పెదపులిపాక గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు.



రోడ్లపక్కన చెత్తాచెదారం

కలవపాముల సర్పంచ్‌పై విచారణ

కలవపాముల(ఉయ్యూరు), జూలై 3 : కలవపాముల సర్పంచ్ పొనుగుమాటి బాలసుబ్రమణ్యంపై వచ్చిన ఫిర్యాదులపై మండల పరిషత్ ఈవోపీఆర్డీ కిరణ్మయి బుధవారం విచారణ చేపట్టారు. 2006 పంచాయతీ ఎన్నికల్లో బీసీ-సీ కులధృవీకరణ పత్రంతో పోటీచేసి 2021 ఎన్నికల్లో ఎస్సీ అభ్యర్థిగా కులధ్రువీకరణ పత్రంతో పోటీచేశారని, గ్రామంలో రోడ్లు వేయకుండా ప్రభుత్వం నుంచి వచ్చిన సిమెంట్ బస్తాలను అమ్ముకున్నాడని, వేసినట్లు బిల్లులు చేసి ప్రభుత్వం నుంచి డబ్బు తీసుకున్నట్లు, గ్రామపంచాయతీ కార్యాలయ పాతభవనం కూల్చి దానిలో వచ్చిన పాత ఇనుము, చెక్కలు, ఇతర వ్యర్థాలు అమ్ముకున్నాడని గ్రామానికి చెందిన పోతురాజు రామారావు గ్రీవెన్స్‌లో చేసిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టినట్లు ఈవోపీఆర్డీ తెలిపారు.

తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలి

రసాభాసగా గన్నవరం పంచాయతీ సాధారణ సమావేశం

గన్నవరం, జూలై 3 : గన్నవరం పంచాయతీ సాధారణ సమావేశం బుధవారం రసాభాసగా సాగింది. సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యుల మధ్య పొంతన లేని వాదనలు జరిగాయి. ఎన్నికల ముందు తొలగించిన పంచాయతీ సిబ్బందిని మళ్లీ తీసుకోవాలని ఉపసర్పంచ్ పాలడుగు నాని, పలువురు వార్డు సభ్యులు డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ఎంపీపీ చెప్పినట్లుగా ఐదుగురిని తొలగించినట్లు తీర్మానం కూడా జరిగిందని సర్పంచ్ నిడమర్తి సౌజన్య తెలిపారు. దీంతో మళ్లీ తీసుకోవాల్సిందేనని ఉప సర్పంచ్‌తో పాటు పలువురు వార్డు సభ్యులు పట్టుబట్టారు. దీంతో సభా గందరగోళంగా మారింది. రిలయన్స్ సంస్థ ఎవరి అనుమతితో రోడ్లను ధ్వంసం చేస్తూ గుంతలు పెడుతున్నారని సభ్యులు ప్రశ్నించారు. లక్షలాది రూపాయలతో నిర్మించిన రోడ్లను ఇష్టారాజ్యంగా గుంతలు పెడుతూ నాశనం చేస్తున్నారని వెంటనే చర్యలు తీసుకో వాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	120, 129, 140
చికెన్ విత్ స్కిన్	226
చికెన్ స్కిన్‌లెస్	236

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.5.40

సుబ్బారాయుడికి దేవదాయశాఖ జిల్లా అధికారి సంధ్య పూజలు

మోపిదేవి, జూలై 3: వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దేవదాయశాఖ జిల్లా అధికారి ఎన్.సంధ్య బుధవారం దర్శించుకున్నారు. దేవ దాయశాఖ జిల్లా అధికారిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించాక ముందుగా ఆమె స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆమెకు ఆలయ అధికారులు, పండితులు, అర్చకస్వాములు ఘన స్వాగతం పలికారు. ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ, దేవదాయ శాఖ జిల్లా తనిఖీ అధికారి కె.శ్రీనివాసరావు, వేద పండితులు ఆలయమర్యాదలతో సత్కరించి, ప్రసాదాలు అందించారు.



సంధ్యకు స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేస్తున్న అధికారులు, అర్చకులు

గుడివాడ అభివృద్ధికి సహకరించండి

గుడివాడ: ఇరవై ఏళ్లుగా గుడివాడ అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని, దానిని గాడిలో పెట్టడానికి సహకరించాలని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌ను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కోరారు. బుధవారం సచివాలయంలో మంత్రి చాంబర్‌లో కలిసి సమస్యలను విన్నవించారు. వెనిగండ్లతో పాటు విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఉన్నారు.



మంత్రి పయ్యావుల కేశవ్‌కు సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

వైసీపీ పాలనలో విద్యా వ్యవస్థ నాశనం: వెనిగండ్ల

గుడివాడ: వైసీపీ ప్రభుత్వం విద్యావ్యవస్థను పూర్తిగా నాశనం చేసిందని, అందరం కలిసి బాగుచేద్దామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. బుధవారం ప్రజావేదికలో విద్యాశాఖాధికారులు, పురపాలక సంఘ ప్రధానోపాధ్యాయులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వమిచ్చిన జీవో 117తో విద్యార్థులతో పాటు విద్యావ్యవస్థకు తీవ్ర నష్టం వాటిల్లిందని, ప్రాథమిక విద్య సర్వనాశమైందని ఎమ్మెల్యేకు ఉపాధ్యాయులు వివరించారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు సరిపడా టెక్స్ట్ పుస్తకాలు వచ్చాయని, తగినంత మంది ఉపాధ్యాయులు లేరని, ఉన్నవారినే సర్దుబాటు చేసి పాఠ్యాంశాలను బోధిస్తున్నామని డీవైఈవో పద్మారాణి తెలిపారు. పాఠశాలల వారీగా విద్యార్థుల సంఖ్య, గత ఏడాది 10వ తరగతి పరీక్షల్లో సాధించిన ఉత్తీర్ణత శాతం, సమస్యలను ప్రధానోపాధ్యాయులు వివరించారు. సమస్యల పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ యిచ్చారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, ఎంఈవోలు విజయకుమార్, బాలాజీ, డేవిడ్‌రత్నరాజు, డి.శ్రీనివాస్, జి.గోపాలరావు, జగన్మోహనరావు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత

గుడివాడ: లవ్ అండ్ కంపాషన్ మినిస్ట్రీస్ జాకబ్ మెమోరియల్ చర్చ్ వేశపోగు జాక్‌టీమ్, జాక్ బ్రైంట్ రాయ్, పాస్టర్ వేశపోగు విజయబాబు ఆధ్వర్యంలో విద్యార్థులకు గుడ్‌మెన్‌పేటలోని చర్చ్ ఆవరణలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఉచితంగా నోటు పుస్తకాలు, స్టడీ మెటీరియల్‌ను అందజేశారు.

గుడివాడలో డిగ్రీ కళాశాల ఏర్పాటు అభినందనీయం

గుడివాడ: పట్టణంలో ఆదిత్య విద్యాసంస్థలు డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. బుధవారం గౌరీశంకరపురంలో ఆదిత్య డిగ్రీ కళాశాలను మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, విశ్వభారతి విద్యా సంస్థల వ్యవస్థాపకుడు పొట్లూరి శ్రీమన్నారాయణ, మున్సిపల్ మాజీ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావుతో కలిసి ఆయన ప్రారంభించారు. విశ్వవిజ్ఞాన్ కరస్పాండెంట్ ఎస్.రాంబాబు, ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే ఎన్.శేషారెడ్డి, డైరెక్టర్ ఎన్.సు గుణారెడ్డి, ప్రిన్సిపాల్ సీహెచ్ రవీంద్రబాబు పాల్గొన్నారు.



కళాశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

కౌలు రైతులకు గుర్తింపు కార్డులివ్వాలి

● ఎమ్మెల్యే వెనిగండ్లకు కౌలురైతు సంఘం వినతి

గుడివాడ: కౌలురైతులకు షరతులు లేకుండా గుర్తింపు కార్డులివ్వాలని కౌలు రైతు సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యే వెనిగండ్ల రాముకు బుధవారం వినతిపత్రం అందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళతానని వారికి ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. సంఘం జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు, నాయకులు గంటా అక్కయ్య లేళ్ల రాంబాబు, బీవీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు

● అభివృద్ధి, సంక్షేమాన్ని జోడెద్దుల్లా పరుగెత్తిస్తారు: గొర్రెపాటి గోపీచంద్

మచిలీపట్నం టౌన్, జూలై 3: "పాలనలో విజన్ ఉన్న నాయకునికి, నేరస్థుడికి మధ్య తేడాను ప్రజలు తెలుసుకున్నారు. మాజీ సీఎం జగన్‌రెడ్డికి పింఛన్‌ను రూ.వెయ్యి పెంచేందుకు ఐదేళ్లు పడితే, కేవలం 18 రోజుల్లోనే చంద్రబాబు రూ.వెయ్యి పెంచారు. బకాయిలతో సహా చెల్లించారు. అభివృద్ధి, సంక్షేమాన్ని చంద్రబాబు జోడెద్దుల్లా పరుగెత్తిస్తారు." టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్ అన్నారు. బుధవారం తన కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వలంటీర్ల వంకతో వృద్ధులను ఎండలో నిలబెట్టి వైసీపీ ప్రభుత్వం ప్రాణాలు తీసిందన్నారు. రాజకీయలబ్ధి కోసం జగన్‌రెడ్డి శవరాజకీయాలు చేశారని, ఆ శాపంతోనే 11 సీట్లకు ఆయన పరిమితమైపోయారని ఆరోపించారు. ఒకటో తారీఖునే ఉద్యోగులకు చంద్రబాబు జీతాలు ఇచ్చారన్నారు. పీవీ ఫణికుమార్ పాల్గొన్నారు.

మసీదుల వద్ద పారిశుధ్య చర్యలు చేపట్టండి

మచిలీపట్నం టౌన్, జూలై 3: మొహర్రం నెల ఈనెల 7 నుంచి ప్రారంభమవుతోందని మచిలీపట్నంలోని మసీదులు, పంజాల వద్ద ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని, పారిశుధ్య చర్యలు మెరుగుపరచాలని మునిసిపల్ కమిషనర్ బాపిరాజును బుధవారం టీడీపీ నేతలు కోరారు. కమిషనర్‌కు వారు వినతిపత్రం అందించారు. మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, కార్పొరేటర్ చిత్తజల్లు నాగరాము, పార్టీ నగర అధ్యక్షుడు ఎండీ ఇలియాస్ పాషా, సయ్యద్ ఖాజా పాల్గొన్నారు.



మునిసిపల్ కమిషనర్ బాపిరాజుకు వినతిపత్రం సమర్పిస్తున్న టీడీపీ నాయకులు

హిందువులకు రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలి

మచిలీపట్నం టౌన్, జూలై 3: పార్లమెంటులో హిందువులను కించపరిచేలా రాహుల్ గాంధీ మాట్లాడారని, వెంటనే ఆయన క్షమాపణ చెప్పాలని విశ్వహిందూ పరిషత్ నాయకులు రాజశేఖర్, పంతం గజేంద్ర, ధూళిపాళ శ్రీరామచంద్రమూర్తి, మహంకాళి శ్రీరాములు డిమాండ్ చేశారు. వీహెచ్‌పీ ఆధ్వర్యంలో బుధవారం కోనేరుసెంటర్‌లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. అల్లూరి కాంతారావు, వర్రె రాజశేఖర్, కోట శ్రీకాంత్, మహంకాళి శ్రీరామశర్మ, దుర్గారావు, చిట్టికుమారి, మంగతాయారు, వడ్డి కృషి, మాగంటి అనిల్, సురేష్ పాల్గొన్నారు.



కోనేరుసెంటర్‌లో నిరసన తెలుపుతున్న వీహెచ్‌పీ నాయకులు



యర్రంశెట్టి శ్రీనివాసరావును సత్కరిస్తున్న పంచాయతీరాజ్ సిబ్బంది

పదవీ విరమణ చేసిన పంచాయతీరాజ్ ఈఈకి సత్కారం

మచిలీపట్నం టౌన్, జూలై 3: పదవీవిరమణ చేస్తున్న పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ యర్రంశెట్టి శ్రీనివాసరావు సలహాలు, సూచనలు విభాగానికి ఎంతో అవసరమని జడ్పీ సీఈవో ఆనందకుమార్ అన్నారు. శ్రీనివాసరావు పదవీ విరమణ చేసిన సందర్భంగా జడ్పీ సమావేశపు హాలులో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు ఉద్యోగులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఏఈ ఏపీఎస్ శ్రీనివాసరావు, అసోసియేషన్ అధ్యక్షుడు హేమప్రకాష్, పడమట భాస్కర్, బోగిరెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉపాధి కార్మికులకు వేతన బకాయిలు చెల్లించాలి

మచిలీపట్నం టౌన్, జూలై 3: ఉపాధి పనులు చేసిన కార్మికులకు వేతనాల బకాయిలు చెల్లించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పవన్‌కుమార్ డిమాండ్ చేశారు. కార్మికులకు జీతాల బిల్లులను ప్రభుత్వం చెల్లించకపోవడంతో ఇబ్బంది పడుతున్నారన్నారు. ఆరునెలలుగా వ్యవసాయ పనులు లేవని, బకాయిలు చెల్లిస్తే వారు ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ఉంటారన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లను రాజకీయ ఒత్తిళ్లతో ఇటీవల తొలగించారని, తిరిగి వారిని పనుల్లోకి తీసుకోవాలని కార్మిక సంఘ నాయకుడు హరిబాబు కోరారు.

నిమ్మకూరు గురుకులాలకు పూర్వవైభవం తెస్తా

● ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా హామీ

పామర్రు, జూలై 3: నిమ్మకూరు గురుకుల పాఠశాల, కళాశాలకు పూర్వవైభవం తెస్తానని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా హామీ ఇచ్చారు. బుధవారం నిమ్మకూరులోని ఏపీ ప్రభుత్వ గురుకుల పాఠశాల, కళాశాలను ఆయన సందర్శించారు. శిథిలావస్థకు చేరుకున్న తరగతి గదులు, వసతి గృహాల భవనాలను పరిశీలించారు. ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థుల సమస్యలను తెలుసుకున్నారు. తగినంత మంది అధ్యాపకులు లేరని గుర్తించారు. వైసీపీ పాలకులు ఈ విద్యా సంస్థలను పట్టించుకోకుండా గాలికొదిలేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నిమ్మకూరు రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాల్లోని తరగతి గదులు, వసతిగృహాలను పునర్నిర్మించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళతానని తెలిపారు. కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, పడమట శ్రీనివాసరావు, నందమూరి జయకృష్ణప్రసాద్, సూరపనేని అంకినీడు, కుదరవల్లి లక్ష్మణస్వామి పాల్గొన్నారు.

మొవ్వ, గూడపాడులో విజయోత్సవ ర్యాలీ

కూచిపూడి: పామర్రును ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. బుధవారం సాయంత్రం మొవ్వ, గూడపాడు గ్రామాల్లో కూటమి నేతలు చేపట్టిన విజయోత్సవ ర్యాలీలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. నేతలు, కార్యకర్తలు, మహిళలు భారీ సంఖ్యలో ఆయనకు స్వాగతం పలికి హారతులిచ్చారు. నియోజకవర్గ ప్రజలు తనను అఖండ మెజార్టీతో గెలిపించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు లింగమనేని రామలింగేశ్వరరావు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నన్నపనేని వీరేంద్ర, నేతలు మండవ రత్నగిరిరావు, తాతినేని పూర్ణచంద్రరావు, మండవ శ్రీకృష్ణ, మండవ కోటేశ్వరరావు, వీరంకి తులసీదాస్, టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



శిథిలావస్థలో ఉన్న భవనాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా



ఎమ్మెల్యే కాగితను సన్మానిస్తున్న మోటార్ సైకిల్ మెకానిక్‌లు

మెకానిక్‌లకు అండగా ఉంటా: కృష్ణప్రసాద్

బంటుమిల్లి, జూలై 3: "మెకానిక్‌లకు అండగా ఉంటా. కమ్యూనిటీ హాలు నిర్మిస్తా. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా" అని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ హామీ ఇచ్చారు. మెకానిక్‌ల దినోత్సవాన్ని పురస్కరించుకుని బంటుమిల్లికి చెందిన యువగణేష్ మోటర్ సైకిల్ మెకానిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయనను బుధవారం సన్మానించారు. అసోసియేషన్ గౌరవసలహాదారుడిగా ఎంపికైన రాజేష్‌కు నియామక పత్రాలు అందించారు. బంటుమిల్లికి చెందిన మెకానిక్‌లు, పార్టీ నాయకులు వీరబాబు, కాశీ, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా గాట్లీబ్ డైమ్లర్ జయంతి

చల్లపల్లి: టూ వీలర్ సృష్టికర్త గాట్లీబ్ డైమ్లర్ జయంతిని, అంతర్జాతీయ మెకానిక్ దినోత్సవాన్ని బుధవారం చల్లపల్లిలో ఘనంగా నిర్వహించారు. ఏపీ టూవీలర్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ నబీషోరి, చల్లపల్లి అసోసియేషన్ అధ్యక్షుడు కొల్లూరి ప్రేమ్‌చంద్, జంపాన దాసు, తుమ్మల చంద్రశేఖర్, హఫీజ్, ఆటోనగర్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్వర్ బాషు, దాసరి శ్రీనివాస్, మెకానిక్‌లు పాల్గొన్నారు. అతిథులు కేక్ కట్‌చేసి మెకానిక్‌లకు పంచిపెట్టారు. సమస్యల పరిష్కారం కోసం మెకానిక్‌లంతా ఐక్యంగా ఉండాలని నేతలు సూచించారు.

నేటి నుంచి సదరం స్లాట్ బుకింగ్

కూచిపూడి, జూలై 3: అంగవైకల్య ధ్రువీకరణ పత్రాల కోసం గురువారం నుంచి సచివాలయాల్లో సదరం స్లాట్ బుకింగ్ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు మొవ్వ ఎండీవో జి.చంద్రశేఖర్‌రావు తెలిపారు. ఈ నెల 4వ తేదీ నుంచి ప్రారంభించే ఈ శిబిరాల్లో స్లాట్ బుకింగ్ చేసుకుంటే సెప్టెంబరు వరకు నిర్ధారణ పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు. అర్హులైన లబ్ధిదారులు మీ సేవ, గ్రామ సచివాలయాల్లో ముందుగా స్లాట్ నమోదు చేసుకోవాలని సూచించారు. మొవ్వ మండలంలోని 16 సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్ల వద్ద గానీ, సమీపంలోని మీ సేవ కేంద్రాల్లో గానీ నమోదు చేసుకోవచ్చునని, దీని కోసం అవసరమైన ధ్రువీకరణ పత్రాలు తీసుకెళ్లాలని ఎండీవో సూచించారు.

గ్యాస్ ఏజెన్సీల వద్ద

వినియోగదారుల పాట్లు

మచిలీపట్నం టౌన్, జూలై 3: ఈకేవైసీ చేయించుకోవడానికి గ్యాస్ ఏజెన్సీల వద్ద రోజూ వినియోగదారులు బారులు తీరుతున్నారు. ఈకేవైసీకి సమయం ఉన్నప్పటికీ ఉచిత గ్యాస్ సిలిండర్ల కోసం తిండీ తిప్పలు లేకుండా పడిగాపులు పడుతున్నారు. గ్యాస్ ట్యూబ్ చెకప్‌కు వినియోగదారుల నుంచి రూ.240 డీలర్లు వసూలు చేస్తున్నారు. ఇతర ప్రాంతాల్లో ఉండి నాలుగైదు నెలల నుంచి గ్యాస్ వాడని వినియోగదారులు వచ్చి ఈకేవైసీని చేయించుకుంటున్నారు. దీనిపై కృష్ణాజిల్లా ఎల్పీజీ డీలర్ల సంఘం గౌరవాధ్యక్షుడు వాలిశెట్టి తిరుమలరావును వివరణ కోరగా కాలం తీరిన రబ్బరు ట్యూబ్‌ల స్థానంలో కొత్త ట్యూబ్‌లు వేసుకునేందుకు రూ.240 మాత్రమే చెల్లించాలని వేరే రుసుము చెల్లించవద్దని తెలిపారు. ఈకేవైసీకి ఇంకా సమయం ఉందని, కంగారు పడాల్సిన పని లేదని ఆయన తెలిపారు.



పడిగాపులు పడుతున్న వినియోగదారులు

కోడూరు మండలంలో ఆర్డీవో పర్యటన

కోడూరు, జూలై 3: మండలంలో బుధవారం మచిలీపట్నం ఆర్డీవో ఎం.వాణి స్థానిక అధికారులతో కలిసి పర్యటించారు. కోడూరు శివారు వేటపాలెం రోడ్డు నుంచి ఉన్న జూపూడి సుభాష్ చంద్రబోస్ పొలాన్ని పరిశీలించారు. అర్జీదారు పెట్టుకున్న ల్యాండ్ కన్వర్షన్ ఫైళ్లను ఆమె పరిశీలించారు. తమ దృష్టికి రాకుండా ల్యాండ్ కన్వర్షన్ పనులు చేస్తున్న వారి వివరాలను తమకు తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ టి.శ్రీనివాసరావు, ఆర్ఐ సుభాషిణి, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అతిసార నివారణపై అవగాహన

మచిలీపట్నం టౌన్, జూలై 3: ముందు జాగ్రత్త చర్యలతో అతిసార వ్యాధిని నివారించుకోవచ్చని డాక్టర్ పి.సుష్మ తెలిపారు. బుధవారం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని ప్రసవానంతర సేవల యూనిట్‌లో నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. అతిసార వ్యాధి లక్షణాలను వివరించారు. ఆహారం వండే ముందు, బిడ్డకు తినిపించే ముందు తల్లులు జాగ్రత్తగా పరిశీలించాలని ఆరోగ్యవిద్య విస్తరణాధికారి సాంబిరెడ్డి సూచించారు. మల, మూత్ర విసర్జనల అనంతరం చేతులు కడుక్కోవాలన్నారు. జిల్లా ఆరోగ్య విద్యాబోధకుడు రాజేంద్రప్రసాద్, ఆరోగ్య పరిరక్షకురాలు సుభాషిణి మాట్లాడారు.

మొవ్వ మండలంలో వరి నాట్లు ప్రారంభం

కూచిపూడి, జూలై 3: మొవ్వ మండలంలో వరి నాట్లు ప్రారంభమయ్యాయి. బోర్ల కింద, ఆయిల్ ఇంజన్ల కింద పోసిన నారు మడులు సిద్ధం కావటంతో రైతన్నలు నాట్లకు శ్రీకారం చుట్టారు. మొవ్వ, కూచిపూడి, కారకంపాడు, భట్లపెనుమర్రు గ్రామాల్లో నాట్లు ప్రారంభమయ్యాయి. విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో మరి కొంతమంది రైతులు దుక్కులు దున్ని పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. కాలువలకు నీటిని విడుదల చేస్తే రైతులు ముమ్మరంగా వరి నారుమడులు పోసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. మొవ్వ మండలంలో 11 వేల 250 హెక్టార్లలో ఈ ఏడాది ఖరీఫ్‌లో వరినాట్లు వేయాల్సి ఉంది. ఖరీఫ్ పనులు ప్రారంభమైన దృష్ట్యా ఇతర రాష్ట్రాల నుంచి వ్యవసాయ కూలీలు తరలివస్తున్నారు.



కూచిపూడిలో నాట్లు వేస్తున్న కూలీలు

ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ చొరవతో

డ్రెయినేజీ సమస్యకు పరిష్కారం

అవనిగడ్డ, జూలై 3: అవనిగడ్డ శివారు సీతాయిలంకలో మురుగు పారుదల వ్యవస్థ సరిగా లేక రోడ్లపైకి మురుగునీరు చేరి ఆ ప్రాంత వాసులు కొద్ది రోజులుగా ఇబ్బంది పడుతున్నారు. ఆ సమస్యకు ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ చొరవతో పరిష్కారం లభించింది. సోమవారం డయేరియా నివారణ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొనగా, స్థానికులు కాలనీలో మురుగునీరు బయటకు వెళ్లక, దోమలు పెరిగి తాము పడుతున్న ఇబ్బందులు మండలి దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై వెంటనే స్పందించిన ఆయన పంచాయతీ అధికారులను పిలిచి వెంటనే సమస్య పరిష్కారించాలని, అందు కోసం సీసీ రోడ్డు మధ్య తూములు వేయించి మురుగునీటిని మళ్లించాలని ఆదేశించారు. వెంటనే పంచాయతీ సిబ్బంది ఆ పనులు చేయించటంతో సమస్యకు పరిష్కారం లభించింది. బుద్ధప్రసాద్‌కు కాలనీవాసుల తరఫున ప్రముఖ న్యాయవాది కర్రా సుధాకర్ ధన్యవాదాలు తెలిపారు.

పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ

గుడ్లవల్లేరు, జూలై 3: పేద విద్యార్థులకు గుడ్లవల్లేరు లయన్స్ క్లబ్ ద్వారా స్కాలర్‌షిప్‌లను పంపిణీ చేశారు. క్లబ్ సభ్యుడు వల్లభనేని రామకృష్ణ(యుఎస్ఏ) సమకూర్చిన రూ.40 వేలను ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ చదువుతున్న 8 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5 వేలు చొప్పున జిల్లా లయన్స్ గవర్నర్ గద్దే శేషగిరి అందజేశారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు నిమ్మగడ్డ శశికళ, మేరుగు పెరుమాళ్లు పాల్గొన్నారు.

సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాల బహూకరణ

ఘంటసాల, జూలై 3: శ్రీకాకుళం సచివాలయానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిత్రపటాలను ఉపసర్పంచ్ శీలం శ్రీనివాసరావు బుధవారం బహూకరించారు. పంచాయతీ సర్పంచ్ ముప్పనేని రవిప్రసాద్, పంచాయతీ కార్యదర్శి జి.శ్రీనివాస్, కూటమి నాయకులు సుగ్గున పవన్‌కుమార్, కోడి శ్రీను, రోళ్ల సుధాకర్, సుధీర్, సురేష్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

అవనిగడ్డ, జూలై 3: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, విద్యార్థులు పర్యావరణంపై అవగాహన పెంపొందించుకోవాలని అవనిగడ్డ సీఐ త్రినాథ్ సూచించారు. గ్రీన్ ఇండియా మిషన్ స్మార్ట్ లివింగ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం శ్రీ చైతన్య పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ జయకుమార్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. గ్లోబల్ వార్మింగ్ పెరిగిపోతోందని, బాల్యంనుంచే మొక్కల పెంపకం, పర్యావరణ సమతుల్యత కాపాడటంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. పాఠశాల ప్రిన్సిపాల్ అదాల రమేష్ బాబు, కో-ఆర్డినేటర్ అశోక్, డీన్ సుధాకర్ పాల్గొన్నారు.



తిరుపతమ్మ ఆలయంలో ఉప్పాల వెంకటకోటేశ్వరరావు యూత్

చంద్రబాబు సీఎం అయ్యారని

తిరుపతమ్మకు మొక్కులు

కోడూరు, జూలై 3: టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చి, చంద్రబాబు ముఖ్యమంత్రి, మండలి బుద్ధప్రసాద్ ఎమ్మెల్యే అయ్యారని పెనుగంచిప్రోలు లక్ష్మీ తిరుపతమ్మ ఆలయంలో అమ్మవారికి బుధవారం పోటుమీద గ్రామానికి చెందిన ఉప్పాల వెంకట కోటేశ్వరరావు యూత్ మొక్కులు చెల్లించింది.

యూటీఎఫ్ సభ్యత్వ నమోదు

తోట్లవల్లూరు, జూలై 3: మండలంలో బుధవారం యూటీఎఫ్ నాయకులు సభ్యత్వ నమోదు క్యాంపెయిన్ నిర్వహించారు. పలు పాఠశాలలు తిరిగి సభ్యత్వ నమోదుతో పాటు ఉపాధ్యాయుల సమస్యలను తెలుసుకున్నారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి అబ్దుల్ హబీబ్, ప్రధాన కార్యదర్శి ఎం.విజయశ్రీ, అధ్యక్షురాలు సీహెచ్ మైథిలి, హిమకుమారి, విష్ణువర్ధన్, అనూష పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ, అన్నదానం

చల్లపల్లి, జూలై 3: అనాథ వృద్ధులకు సహాయం చేయడం అభినందనీయమని ఎస్ఐ సీహెచ్ చినబాబు అన్నారు. తమ కుమార్తె వాగ్దేవి పుట్టినరోజు సందర్భంగా జనసేన నాయకులు అడపా అద్దంకి నాంచారయ్య, కృష్ణకుమారి దంపతులు సీయోను వృద్ధాశ్రమంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. వృద్ధులకు అన్నదానం చేసి దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఎస్ఐ చినబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జనసేన పట్టణ అధ్యక్షుడు బొందలపాటి వీరబాబు, అడపా రవి, ఆశ్రమ నిర్వాహకులు శీలం భాస్కరరావు, అడపా లీలాప్రసాద్, అడపా బాబూరావు పాల్గొన్నారు.

భగవద్గీతలో ఎన్నో జీవిత రహస్యాలు

మచిలీపట్నం టౌన్, జూలై 3: భగవద్గీతలో ఎన్నో జీవిత రహస్యాలు దాగి ఉన్నాయని తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మాచారిణి జొన్నలగడ్డ మాధవి అన్నారు. గాంధీ విద్యాలయంలో బుధవారం నుంచి విద్యార్థులకు భగవద్గీతపై ప్రత్యేక శిక్షణ తరగతులను విద్యాలయం కన్వీనర్ మాజేటి చక్రవర్తి ప్రారంభించారు. మైసూరు దత్తపీఠం గణపతి సచ్చిదానంద స్వామిజీ నుంచి భగవద్గీత శ్లోక పఠనంలో స్వర్ణపతకం పొందిన మాధవితో ఈ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు.

మచిలీపట్నంలో డ్రెయినేజీ

పనులు పూర్తి చేస్తాం: ఎంపీ బాలశౌరి

మచిలీపట్నం, జూలై 3(ఆంధ్రజ్యోతి): మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్‌లో పెండింగ్‌లో ఉన్న డ్రెయినేజీ పనులను త్వరలోనే పూర్తిచేస్తామని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి ఒక ప్రకటనలో తెలిపారు. ఢిల్లీలో కేంద్ర గృహనిర్మాణ, పట్టణాభివృద్ధి మంత్రిత్వశాఖ అధికారులతో బుధవారం ఎంపీ సమావేశం నిర్వహించారు. మచిలీపట్నంలో చేపట్టే అభివృద్ధి పనులు, వాటి పురోగతిపై చర్చించారు. 2023 నుంచి కేంద్రప్రభుత్వ నిధులతో చేపట్టిన పనులు నిలిచి పోయాయని ఎంపీకి అధికారులు వివరించారు. నిలిచిపోయిన పనులను త్వరితగతిన ప్రారంభించాలని, డ్రెయినేజీ పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఎంపీ కోరారు. మచిలీపట్నంలో భవిష్యత్తులో చేపట్టబోయే పనుల డీటెయిల్డ్ ప్రాజెక్టును రూపొందించేందుకు త్వరలో కేంద్రబృందం మచిలీపట్నంలో పర్యటిస్తుందని అధికారులు హామీ ఇచ్చారని ఎంపీ తెలిపారు.

ఉప్పులోడు లారీ బోల్తా..ఇద్దరికి గాయాలు

చల్లపల్లి, జూలై 3: జాతీయ రహదారిపై లక్ష్మీపురం వద్ద బుధవారం మధ్యాహ్నం రోడ్డు ప్రమాదం జరిగింది. ఉప్పులోడుతో వస్తున్న లారీ బైక్‌ను తప్పించబోయి అదుపుతప్పి బోల్తా కొట్టింది. ద్విచక్రవాహనం కూడా గోతిలోకి దూసుకువెళ్లటంతో బైక్‌పై ఉన్నవారికి గాయాలయ్యాయి. ఎవరికీ ప్రాణాపాయం కలుగలేదు. మచిలీపట్నం మండలం కోన గ్రామానికి చెందిన కె.శ్రీను, బి.శ్రీను బైక్‌పై మంగళాపురం వచ్చి తిరిగి హైవేమీదుగా వస్తున్నారు. అదే సమయంలో ఒంగోలు వైపు నుంచి గిలకలదిండి వెళుతున్న ఉప్పులారీకి బైక్ అడ్డు వచ్చింది. బైక్‌ను తప్పించబోయి లారీని పక్కకు తిప్పగా అదుపుతప్పి మార్జిన్‌లోకి బోల్తాకొట్టింది. బైక్ కూడా గోతిలో పడిపోవడంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. మోపిదేవి 108 అంబులెన్స్ సిబ్బంది ప్రాథమిక చికిత్సలు చేసి, మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. లారీ డ్రైవర్ తోట శ్రీను ప్రాణాపాయం లేకుండా బయటపడ్డాడు. ఎస్ఐ సీహెచ్ చినబాబు ఘటనా ప్రదేశానికి చేరుకుని ప్రమాద కారణాలు తెలుసుకున్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు..వ్యవసాయ కూలీ మృతి

మచిలీపట్నం టౌన్, జూలై 3: విజయవాడ రోడ్డులోని సుమ కన్వెన్షన్ హాలుకు దగ్గరలోని దుర్గ రైస్‌మిల్లు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యవసాయ కూలీ అక్కడికక్కడే మృతిచెందాడు. రూరల్ ఎస్ఐ పద్మ తెలిపిన వివరాల ప్రకారం..గూడూరు మారుతీనగర్‌కు చెందిన కుంభా వెంకటేశ్వరరావు(30) బైక్‌పై వెళుతూ డివైడర్‌ను క్రాస్ చేస్తుండగా కారు ఢీకొంది. దీంతో కుంభా వెంకటేశ్వరరావు అక్కడికక్కడే మృతిచెందాడు. వెంకటేశ్వరరావుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వెంకటేశ్వరరావు మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. ఎస్ఐ పద్మ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో రొయ్యల చెరువు గుమాస్తా మృతి

గుడివాడ రూరల్, జూలై 3: మండల పరిధిలోని శేరీదింటకుర్రు గ్రామంలో రొయ్యల చెరువుపై గుమాస్తాగా పని చేస్తున్న పెడన మండలానికి చెందిన చుక్కా మునియ్య(46) విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో బుధవారం మరణించాడు. విద్యుత్ వైరు తెగిపోవటంతో పక్కన ఉన్న వ్యక్తితో విద్యుత్‌ను నిలుపుదల చేయమని చెప్పాడు. అతను విద్యుత్ నిలుపుదల చేసే లోపే వైరును టేపు చుట్టడానికి పట్టుకున్నాడు. దీంతో షాక్ తగిలి అక్కడికక్కడే మరణించాడు. అతనికి భార్య, ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. గుడివాడ ఏరియా ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించారు.